


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 135 | కర్నూలు | బుధవారం జూన్ 11, 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

## ఆడబిడ్డలపై చేయి వేయాలంటేనే భయపడాలి

### అనంత జిల్లాలో ఘటనలపై సిఎం చంద్రబాబు సీరియస్ పోలీస్ అధికారులతో సమీక్ష..కఠిన చర్యలకు ఆదేశం



అమరావతి,జూన్10 : ఆడబిడ్డలపై చేయి వేయాలంటే భయపడే పరిస్థితిని రాష్ట్రంలో తీసుకురావాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం అమరావతిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు- చేసుకున్న ఘటనలపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం కేసును వేగంగా విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పక్కా ఆధారాల సేకరణతో నిర్దిష్ట సమయంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నానన్నారు. గంజాయి బ్యాచ్ ఆట కట్టించాలని స్పష్టం చేశారు. ఇక ఈ రెండు ఘటనల్లో దర్యాప్తు, చర్యల వివరాలను సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా డీజీపీ, ఉన్నతాధికారులు వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోన్న దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం జరుగుతోంది. ఈ ఘటనలో యువకుల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆరుగురు నిందితులను మంగళవారం అచ్చంపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని సైతం అరెస్ట్ చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. బాధితురాలని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించామన్నారు. అలాగే బాధితురాలికి పూర్తి భద్రత కల్పించామని స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే సంచలన లేఖ

ఢిల్లీ: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి  ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే   లేఖ రాశారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీపై ప్రధానికి లేఖ రాశారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ నియామకం ఆలస్యమవుతుండటంపై లేఖలో ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి అని తెలిపారు మల్లికార్జున ఖర్గే. స్పీకర్ తర్వాత లోక్‌సభలో రెండో అత్యున్నత స్థానం డిప్యూటీ స్పీకర్‌దేనని మల్లికార్జున ఖర్గే గుర్తుచేశారు. ప్రతి కొత్త లోక్‌సభ రెండో లేక మూడో సెషన్‌లో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం సంప్రదాయమని ఉద్ఘాటించారు. మొదటి నుంచి పదహారో లోక్‌సభ వరకు అన్ని లోక్‌సభల్లో డిప్యూటీ స్పీకర్ ఉన్నారని వివరించారు. కానీ 17వ, 18వ లోక్‌సభల్లో ఆ పదవి ఖాళీగా ఉందని చెప్పుకొచ్చారు మల్లికార్జున ఖర్గే. ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం సంప్రదాయమని చెప్పారు. ఈ స్థానం ఖాళీగా ఉండటం రాజ్యాంగ ఉల్లంఘన అని తెలిపారు. వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించాలంటూ ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు.



## జాతీయ మహిళా కమిషన్ చొరవ అభినందనీయం

### ఎక్స్ వేదికగా అభినందించిన మంత్రి లోకేశ్

అమరావతి,జూన్10 : సాక్షి ఛానల్ చర్చలో అమరావతి మహిళలను ఉద్దేశించి జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నది. అమరావతిని వేశ్యల నగరంగా కృష్ణంరాజు అభివర్ణించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో ఆగ్రహ జ్వాలలు రేకెత్తాయి. సాక్షి ఛానెల్‌పై, జర్నలిస్ట్ కృష్ణంరాజుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కృష్ణంరాజు చేసిన అనభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది.



మహిళా కమిషన్ చొరవను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓట్వీట్ చేశారు. అమరావతి మహిళలను ఉద్దేశిస్తూ కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్‌కు అభినందనలు. అమరావతి మహిళా రైతులను వేశ్యలుగా అభివర్ణించడం సిగ్గుచేటు- మాత్రమే కాదు.. నేరం కూడా. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సత్వరమే స్పందించి వేగంగా చర్య తీసుకోవడం ద్వారా అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదనే బలమైన సందేశం ఇచ్చింది. మేమంతా అమరావతి మహిళా రైతుల వెనుక ఉన్నాం. వారికి సత్వరమే న్యాయం జరగాలి అన్నారు.

## అమరావతి మహిళలపై కు వ్యాఖ్యలు

### సుమోటగా తీసుకున్న జాతీయ మహిళా కమిషన్ మూడ్రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని డిజిపికి ఆదేశం

న్యూఢిల్లీ,జూన్10 : అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ లేఖ రాశారు. కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఎన్‌సీడబ్ల్యూ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. అమరావతి ఉద్యమంలో మహిళా రైతులు కీలకపాత్ర పోషించారని మహిళా కమిషన్ పేర్కొంది. కృష్ణంరాజు వ్యాఖ్యలపై మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా తీసుకుని మహిళా కమిషన్ విచారణకు ఆదేశించింది. అలాగే  అసభ్య వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అమరావతిని



'వేశ్యల రాజధాని'గా సంబోధించడం అనేది రాజధాని ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన మహిళా రైతులను తీవ్రంగా అవమానించడమేనని జాతీయ మహిళా కమిషన్ పేర్కొంది. ఈ అసహ్యకరమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలను తీవ్రంగా జాతీయ మహిళా కమిషన్ ఖండిస్తోందని ఛైర్‌పర్సన్ విజయా రహట్కర్ అన్నారు. కాగా మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ప్రధాన నిందితుడైన కృష్ణంరాజు మూడు రోజుల కిందటే విజయవాడలోని తన ఇంటికి తాళం వేసి కుటుంబంతోపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని కోసం మూడు ప్రత్యేక పోలీస్ బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. వేరే రాష్ట్రానికి వెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే కృష్ణంరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు జగన్ మీడియా తీరుపై ఏపీ వ్యాప్తంగా మహిళల నిరసనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.

## మహిళలపై సజ్జల అనుచిత వ్యాఖ్యలు

### చర్య తీసుకోవాలంటూ డిజిపికి రఘురామ లేఖ

అమరావతి,జూన్10(ఆర్ఎన్ఎ): రాజధాని ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. కుల వివక్షకు సంబంధించిన పదం వాడిన సజ్జలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన దూషణలు అమరావతిలోని వేలాది మంది మనోభావాలను దెబ్బతీశాయని.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవమానకర భాషను



ఎవరూ వాడకుండా చర్యలు తీసుకోవాలని రఘురామ కోరారు. అమరావతి మహిళలపై సాక్షి ఛానెల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న మహిళలను ఉద్దేశించి సజ్జల నోరు పారేసుకున్నారు. వైకాపా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పిశాచాలు కూడా ఇలా చేయరేమో? వారిని రాక్షసులు అని కూడా అనలేం. అందరూ కలిసి సంకరం అయినట్టుంది. ఇవన్నీ కలిసి తయారైన తెగ ఏదో ఒకటున్నట్టుంది. ఆ తెగ పూనుకుంటే మాత్రమే ఇలా చేయగలదు. పూర్తిగా సమన్వయంతో కమ్ముకుని కొట్టాలని ప్రయత్నిస్తోంది. ఇవేవీ సహజమైనవి కావు, వ్యవస్థీకృతంగా చేస్తున్న నిరసన ప్రదర్శనలే అని సజ్జల వ్యాఖ్యానించారు.

## మహిళలపై సజ్జల వ్యాఖ్యలు దారుణం

### మూర్ఖుడిలా ప్రవర్తిస్తున్న సజ్జల తదితరులు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

అన్నమయ్య,జూన్10  అమరావతి మహిళలపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలను కించపరుస్తూ సజ్జల ఒక మూర్ఖుడిలా మాట్లాడారని మండిపడ్డారు. వైకాపా చేసిన తప్పునే మళ్లీ మళ్లీ చేస్తోందన్నారు. సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డి సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకొని నాపై కూడా దుష్ప్రచారం చేశారు. వైఎస్ కుమార్తె, ఒక మహిళ అని కూడా చూడకుండా కించపరిచారు. జగన్ అందరినీ నా అక్కాచెల్లెళ్లు అంటారు.. కానీ, ఆయన సొంత చెల్లికే మర్యాద లేదు. ఇక రాష్ట్రంలోని మహిళలను ఏం గౌరవిస్తారని విమర్శించారు.  ఏపీ మహిళలను ఉద్దేశించి వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సజ్జల వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరూ ఖండిస్తున్నారు. తాజాగా వైసీపీ నేత చేసిన కామెంట్స్‌పై  వైఎస్ షర్మిలా రెడ్డి స్పందిస్తూ.. మహిళల మీద సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా మన్నారు. మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళలను పిశాచులతో పోల్చుతారా.. మహిళలను రాక్షసులు అంటారా అంటూ ఫైర్ అయ్యారు. సంకర జాతి అని మహిళలను



అవమానిస్తారా అని అన్నారు. చేసిన తప్పుకి క్షమాపణ చెప్పడానికి ఎందుకు నామోషీ అని ప్రశ్నించారు. వైసీపీ చేసిన తప్పును మళ్ళీ మళ్ళీ చేస్తోందన్నారు. ఇదే సజ్జల కొడుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని తనను కూడా వదిలి పెట్టలేదన్నారు. సైతాన్ సైన్యంతో తన మీద తప్పుడు ప్రచారం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ బిడ్డ అని, ఒక మహిళా అని చూడకుండా కించపరిచారని అన్నారు. జగన్ నా అక్క చెల్లెళ్ళు అంటారని.. కానీ జగన్ సొంత చెల్లికే మర్యాద లేదని.. ఇక రాష్ట్రంలో వీళ్ళు మహిళలకు ఏం గౌరవం ఇస్తారు

## చంద్రబాబు నివాసంలో కిషన్ రెడ్డి లంచ్

### బాబుతో పలు రాజకీయ అంశాలపై చర్చ

అమరావతి,జూన్10(ఆర్ఎన్ఎ): విజయవాడ పర్యటకు వెళ్లిన కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. టీ-డీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.. చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ లంచ్ మీటింగ్‌లో పలు అంశాలపై చర్చించారు.. ఆ తర్వాత చంద్రబాబు నివాసం నుంచి విజయవాడ బయల్దేరి వెళ్లారు.. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విజయవాడ వచ్చినందుకు సీఎం చంద్రబాబు లంచ్ కి పిలిచారని తెలిపారు.. కేంద్ర సహాయం, ఏపీకి రావాల్సిన ప్రాజెక్ట్ లపై చర్చించామని వెల్లడించారు.. ఇక, విజయవాడ పర్యటనకు వచ్చినందుకు మర్యాద పూర్వకంగా కలవడానికి సీఎం చంద్రబాబు పిలిచారని తెలిపారు.. మైనింగ్, ఇతర ప్రాజెక్ట్ లపై ఈ లంచ్ సమావేశంలో చర్చించమన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. వాటితో పాటు- తాజా రాజకీయ పరిణామాలు..తెలంగాణ రాజకీయాలపై కొద్దిసేపు చర్చించినట్టు సమాచారం..ఇక, విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. 'మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి ' కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు- ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపీ నేతలు దేశ అభివృద్ధికి మోదీ పాలన ఎంత కీలకమైందో వివరించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోదీ పాలన ఉండిందని  అన్నారు

# సంపాదకీయం

## కొంపముంచుతున్న ట్రంప్ విధానాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొస్తున్న వలస విధానాలపై స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత నాలుగు రోజులుగా లాస్ ఏంజిల్స్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆందోళనలు మరింత ఉద్ధృతమవుతోన్న నేపథ్యంలో మరిన్న బలగాలను పంపాలని ట్రంప్ ఆదేశించారు. సుమారు 700 మెరీన్లను తాత్కాలికంగా లాస్ ఏంజిల్స్‌లో మోహరించాలని ఆయన సూచించారు. అంతేకాదు, 'నిరసనకారులకు తగిన గుణపాఠం ఉంటుంది' అంటూ ఆయన హెచ్చరించారు.డొనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో "మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్" నినాదంతో అగ్రరాజ్యానికి పూర్వ వైభవం తెస్తానని హామీ ఇచ్చారు. అయితే, ఆయన అధ్యక్షుడిగా రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు, ముఖ్యంగా టారిఫ్ ఆంక్షలు, అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊహించని నష్టాలను కలిగిస్తున్నాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. చైనాతో సహా అనేక దేశాలపై విధించిన భారీ సుంకాలు, కఠిన వీసా నిబంధనలు, ఇతర విధానాలు అమెరికా యొక్క పర్యాటక రంగం, ఉపాధి అవకాశాలు, వ్యాపార విస్తరణను దెబ్బతీస్తున్నాయిట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, చైనాతో సహా అనేక దేశాలపై భారీ సుంకాలను విధించారు. చైనా ఉత్పత్తులపై ఏకంగా 155% సుంకం విధించాలన్న నిర్ణయం ఆర్థిక ఉద్రిక్తతలను తీవ్రతరం చేసింది. ఈ సుంకాలు అమెరికా ఆర్థిక ప్రయోజనాలను కాపాడతాయని ట్రంప్ భావించినప్పటికీ, ఫలితాలు ఊహించిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, ఈ టారిఫ్ విధానాల వల్ల 2025లో అమెరికా పర్యాటక రంగంలో సుమారు 100 బిలియన్ డాలర్ల ఆదాయ నష్టం జరిగే అవకాశం ఉంది. అదనంగా, ఈ ఆంక్షలు అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీసి, స్థానిక ఉపాధి అవకాశాలను కూడా తగ్గిస్తున్నాయి.ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న మునుపటి కాలంలో, 2024లో అమెరికా సుమారు 7 కోట్ల మంది పర్యాటకులను ఆకర్షించి, 155 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ ఆదాయం హోటళ్లు, రిటైల్ దుకాణాలు, రవాణా, ఆహార?పానీయ రంగాలను సమృద్ధిగా ఉంచింది. అయితే, ట్రంప్ కొత్త టారిఫ్ విధానాలు, కఠిన వీసా నిబంధనల కారణంగా 2025లో పర్యాటకుల సంఖ్య 14% తగ్గినట్లు అంచనా వేయబడింది. కెనెడా నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా ఐదవ వంతుకు పడిపోయింది. దీని ఫలితంగా, పర్యాటక రంగంలో ఖర్చు సుమారు 9 బిలియన్ డాలర్లు తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి, ఇది హోటళ్లు, రిటైల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ట్రంప్ యొక్క టారిఫ్ విధానాలు, ఆర్థిక అనిశ్చితి అమెరికాలో వ్యాపార విస్తరణను ప్రభావితం చేస్తున్నాయి. డెల్టా ఎయిర్‌లైన్స్, బెల్లూస్కూరా వంటి సంస్థలు తమ ఆర్థిక అంచనాలను సవరించుకుంటున్నాయి. బ్రిటన్‌కు చెందిన క్యారెక్టర్ గ్రూప్, మద్యం తయారీ దిగ్గజం డియాగో వంటి కంపెనీలు కెనెడా, మెక్సికోపై విధించిన సుంకాల కారణంగా తమ వ్యాపార ప్రణాళికలను మార్చుకుంటున్నాయి. డియాగో సంస్థ ఒక్కటే సుమారు 2 బిలియన్ డాలర్ల నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని అంచనా. అదనంగా, ఆపిల్ సీఈవో టిమ్ కుక్ ట్రంప్ హెచ్చరికలను ఖాతరు చేయకుండా, ఐఫోన్ తయారీని భారత్‌లో కొనసాగిస్తున్నారు. జాన్ డీర్ వంటి ట్రాక్టర్ తయారీ సంస్థలు కూడా తమ ఉత్పత్తి రంగాన్ని కెనెడాకు తరలించే ఆలోచనలో ఉన్నాయి. ఈ చర్యలు అమెరికాలో స్థానిక ఉపాధి అవకాశాలను తగ్గిస్తున్నాయి.ట్రంప్ విధానాలు భారతీయ సంతతి అమెరికన్లు, భారతీయ వలసదారులపై కూడా ప్రభావం చూపుతున్నాయి. భారత ఉత్పత్తులపై సుంకాల విషయంలో కొంత ఉపశమనం లభించినప్పటికీ, హెచ్1బీ వీసా నిబంధనల కఠినత, గ్రీన్ కార్డ్ ఉన్నవారిని బహిష్కరించే హెచ్చరికలు, స్వదేశానికి పంపే డబ్బుపై 5% సుంకం వంటి చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నిర్ణయాలు భారతీయ సంతతి వ్యాపారవేత్తలు, ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. అయినప్పటికీ, భారత్‌లో ఐఫోన్ తయారీ వంటి చర్యలు భారత ఆర్థిక వ్యవస్థకు లాభదాయకంగా ఉన్నాయి."మేక్ అమెరికా గ్రేట్ అగెయిన్" నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ విధానాలు, ముఖ్యంగా టారిఫ్ ఆంక్షలు, కఠిన వీసా నిబంధనలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్నాయి. పర్యాటక రంగంలో ఆదాయ నష్టం, ఉపాధి అవకాశాల క్షీణత, కంపెనీల వెనక్కి తగ్గడం వంటి పరిణామాలు ట్రంప్ విధానాల పరిణామాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. భారతీయ సంతతిపై కూడా ఈ చర్యలు గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. భవిష్యత్తులో అమెరికా ఈ విధానాలను సమీక్షించి, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సంబంధాలను కాపాడుకునే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.లాస్ ఏంజిల్స్ నగరంలోని వలసదారుల నిర్బంధ కేంద్రం వద్ద వందలాది మంది గుమికూడి ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'సిగ్గు! సిగ్గు! సిగ్గు' అంటూ ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. నిరసనలు అదుపుతప్పడంతో పోలీసులు ఫ్లాష్‌బాంబ్‌లు, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించి వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినాసరే ఆందోళనకారులు వెనక్కి తగ్గడం లేదు. ప్రభుత్వ ఆస్తులు, సిబ్బందిని రక్షించేందుకు సైన్యం తాత్కాలికంగా ఒక బెటాలియన్‌ను మోహరించనుంది. ఇప్పటివరకు ట్రంప్ ప్రభుత్వం ఇన్సరెక్షన్ యాక్ట్‌ను అమలు చేయలేదు. ఇది అమలయ్యే దశకు వెళ్లితే, పౌర చట్టాల అమలులో సైన్యం ప్రత్యక్షంగా పాల్గొంటుంది.కాలిఫోర్నియా ప్రభుత్వం ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ... మోహరింపును నిలిపివేయాలని కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది.

# శభాష్ మాధవీలత...

ఒంగోలు, జూన్ 10, కాశ్మీరాన్ని భారత దేశంతో కలపాలనే శతాబ్దాల కల సాకారమైంది. చీనాబ్ వంతెన నిర్మాణం పూర్తయింది. ఎప్పుడో 132 ఏళ్లకు పూర్వం ఆనాటి రాజరిక పాలకులు కన్న కలను ఈ నాటి ప్రజాస్వామ్య ప్రభుత్వం సాకారం చేసింది.జమ్మూ కాశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో చీనాబ్ నదిపై నిర్మించిన చీనాబ్ రైల్వే వంతెనను ఇటీవలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా గుర్తింపు పొందిన చీనాబ్ వంతెన ఒక సాకేతిక అద్భుతం. భారత రైల్వే చరిత్రలో ఇదొక మైలురాయి. అంతే కాదు ప్రపంచం ఎదుట మనం భారతీయులం తలెత్తుకుని నిలిచేలా చేసిన మరో సాంకేతిక అద్భుతం చీనాబ్ వంతెన నిర్మాణం.అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులు, భౌగోళిక సంక్లిష్టతలు ఉన్న శివాలిక్ పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ చీనాబ్ నదిపై ఈ వంతెనను నిర్మించారు. వంతెన అంటే వంతెన కాదు.. అదొక ఇంగినీరింగ్ అద్భుతం.. చీనాబ్ నదీగర్భం నుండి 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన చీనాబ్ వంతెన, ప్రపంచ పర్యాటక వింతల్లో ఒకటిగా పేర్కొనే పారిస్‌లోని ఐఫిల్ టవర్ ను తలదన్నేలా నిర్మితమైన మహాద్భుతం. అవును ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తులో చీనాబ్ వంతెన నిర్మాణం అయింది.ఇలా చెప్పుకుంటూ పోతే చెప్పుకోలేనన్ని వింతలు, విశేషాల సమాహారం చీనాబ్ బ్రిడ్జి. ఈ ఆలోచన సాకారం కావడానికి ఏకంగా 132 ఏళ్లు పట్టింది. 1,315 మీటర్ల పొడవైన వంతెన నిర్మాణానికి ఇంతకాలం పట్టిందంటేనే అది ఎంతటి కష్ట సాధ్యమైన కార్యమో వేరే చెప్పనక్కర లేదు. అంతే కాదు ఎంతటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేయగల సామర్థ్యం మనకు ఉందని ప్రపంచానికి చాటి చెప్పిన మహాద్భుతం.నిజానికి.. ఇది ఈనాటి ఆలోచన కాదు. దేశ విభజనకు ముందు అప్పటి కాశ్మీర్ రాజు రాజా హరిసింగ్ ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్వే లైన్ నిర్మాణం కోసం తొలి అడుగు వేస్తే.. స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ పాలకుల కాలంలో.. స్వాతంత్రం వచ్చిన తర్వాత నెహ్రూ మొదలు మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల వరకు, రాజా హరిసింగ్ కలను సాకారం చేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. ఒకప్పుడు,, అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ రూ.50 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి ప్రణాళికను సిద్దం చేశారు. కానీ, అది అమలు కాలేదు. ఇప్పుడు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ.43,800 కోట్ల వ్యయంతో రాజా హరిసింగ్ కలను సాకారం చేసింది. ఆ రోజున.. ఆ మార్గంలో స్టీమ్ ఇంజిన్ రైలు చాలని అనుకుంటే, ఈ రోజున అదే మార్గంలో వందే భారత్ రైలు పరు గులు తీస్తోంది.ప్రదాని నరేంద్ర మోదీ మొదలు మన



దాకా.. అందరం సగౌరవంగా తలెత్తుకుని నిలిచామంటే.. అసాధ్యాలను సుసాధ్యం చేసి.. ఇంతటి మహాద్భుతాన్ని మన ముందు నిలబెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారు. సాకేతిక సాంకేతిక విజ్ఞానాన్ని వడపోసిన మేధా యోధుల మొదలు, రాళ్లెత్తిన కూలీల వరకూ.. ఎందరో.. ఎందరెందరో ఉన్నారు. అలాంటి వారిలో జి. మాధవీలత ఒకరు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాక్ ఇంజనీరింగ్ నిపుణురాలు. మాధవిలత ఈ ప్రాజెక్టుపై జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా 17 సంవత్సరాలు పని చేశారు. నిర్మాణం సవాళ్లతో నిండిపోయింది, అయినా ఆమె, తమ బృందంతో కలిసి వీచే ఎదురు గాలులను సవాలుగా తీసుకుని ఎదురు నిలిచి, డిజైన్ యాజ్ యు గో విధా నంలో,ప్రపంచాన్ని అబ్బురపరిచే, ఇంజనీరింగ్ అదుతాన్ని ఆవిష్కరించారు.. చీనాబ్ వంతెన ప్రణాళిక 2005 లో ప్రారంభమైంది, 2022 లో ట్రయల్ రన్ పూర్తయింది. నిజానికి.. ఈ ప్రాజెక్ట్ పుర్తయిందంటే.. అందుకు, ప్రధాన కారణం మాధవీలత. కొండలు గుట్టలను పిండి చేస్తూ.. అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ.. అద్భుత నిర్మాణాలతో ముందుకు సాగిన మాధవీలత.. 17 ఏళ్ల చారిత్రక చీనాబ్ నిర్మాణ ప్రయణాన్ని మాటల్లో వర్ణించడం సామాన్యులకు సాధ్యం కాదు. అందుకే.. ఆమె మాటల్లోనే చెప్పాలంటే.. చీనాబ్ వంతెన వంటి సివిల్ ఇంజనీరింగ్ అద్భుత నిర్మాణం, ప్రణాళిక రూపకల్పనతో మొదలైన తొలి అడుగు నుంచే సవాళ్ళను ఎదుర్కొంది. ప్రతి అడుగులోనూ అవరోధాలు ఎదురయ్యాయి. ముదుకు సాగే కొద్దీ, భౌగోళిక పరిస్థితిలో వస్తున్న మార్పులు ఎప్పటికప్పుడు కొత్త సవాళ్ళను ముందుంచాయి. నిరంతరం మారుతున్న భౌగోళిక, భూసాంకేతిక పరిస్థితులను పరిగణ నలోకి తీసుకుంటే.. ముందుగా నిర్దేశించుకున్న ప్రణాళిక ఆధారంగా, ముందుగా నిర్ణయించిన పరిష్కారాలతో బలమైన డిజైన్ రూపొందించడం అసాధ్యంగా మారిందని ఆమె ఇటీవల ఒక పత్రికలో రాసిన వ్యాసంలో, వివిధ పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో పేర్కొన్నారు. అందుకే.. డిజైన్ యాజ్ యు గో విధానం ఎంచుకుని ముందుకు సాగినట్లు చెప్పారు. డిజైన్ యాజ్ యు గో విధానం అవలబించడం వల్లనే నిర్మాణం పూర్తయిందని వివరించారు. నిటారుగా నిలిచిన ఎత్తైన రాతి కొండులు, ఏటవాలుగా నేలకు వాలిన పర్వత శ్రేణులను అనుసంధానం చేస్తూ నిర్మాణ పనులను సాగించడం, ముఖ్యంగా స్థంభాల పునాదులు నిర్మించడం ఒక ప్రధాన సవాలుగా మారిందని చెప్పారు. అయితే.. దృఢ చిత్తంతో ముందుకుసాగి అసాధ్యాలను సుసాధ్యం చేశామని మాధవీ లత చెప్పారు. నిజానికి.. చీనాబ్ వంతెన సాకారం చేయడంలో.. మెయిన్ పిల్లర్ పాత్రను పోషించిన మాధవీలతతో పాటుగా మరెందరో చేసిన కృషి అసాధారణం, అత్యద్భుతం. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాలోని యడుగుండ్లపాడు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన మాధవి, ఏఔజ నుంచి ఃఎవఇఫ్ర, ఔమి వరంగల్ నుంచి ఓఎవఇఫ్ర (గోల్డ్ మెడల్), ఎమి మద్రాస్ నుంచి ఖష్ర.ఆ (2000) పూర్తి చేశారు. 2003 నుంచి ఎమోఇలో ప్రొఫెసర్‌గా, ప్రస్తుతం సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. 2021లో ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ నుంచి బెస్ట్ ఉమెన్ జియోటెక్నికల్ రీసెర్చర్ అవార్డు సైతం అందుకున్నారు. 2022లో భారతదేశంలోని టాప్ 75 ఉమెన్ ఇన్ గాఇంఓలో చోటు దక్కించుకున్నారు.ప్రస్తుతం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో జియోటెక్నికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఎమోఇలో మొదటి మహిళా ఫ్యాకల్టీగా, జియోటెక్నికల్ ఇంజనీరింగ్ భవనంలో మహిళల కోసం టాయిలెట్ సౌకర్యం కోసం మాధవీలత పోరాడారు. ఆమె ల్యాబ్‌ను మహిళా విద్యార్థులకు సమాన అవకాశాల కల్పనకు కృషి చేశారు. 2007లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి టీచర్ ఎక్స్‌ట్రాఆర్డినరీ అవార్డును మాధవీలత అందుకున్నారు. తెలుగు సంతతికి చెందిన మాధవి లత, ఒకప్పుడు డాక్టర్ కావాలని కలలు కన్నారు. కానీ ఇంజనీరింగ్ వైపు మళ్ళీ చినాబ్ వంతెన నిర్మాణంలో చారిత్రక విజయాన్ని సాధించారు.అందుకే.. ప్రదాని మోదీ.. ఈ అద్భుత సృష్టిలో భాగస్వాములు అయిన ప్రతి ఒక్కరినీ పేరు పేరున అభినందించారు. ముఖ్యంగా.. ప్రధాని మోదీ చీనాబ్ వంతెనను ప్రారంభించిన వెంటనే మాధవీ లతను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, చీనాబ్ వంతెన నిర్మాణంలో మాధవిలత, ఆమె బృందం చేసిన కృషికి దేశం మొత్తం గర్విస్తోందని అన్నారు. ప్రధాని సహా పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్న మాధవీలత అనేక పురస్కారాలను అందుకున్నారు. మాధవీలత ప్రస్తుతం సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

# కృష్ణా తరంగాలపై ప్రపంచ రికార్డుకు సర్వం సిద్ధం

**- 200 వాటర్ క్రాఫ్ట్స్‌పై వెయ్యిమందితో ఫ్లోటింగ్ యోగాకు ఏర్పాట్లు**
**- యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వినూత్న ప్రయత్నం**
**- ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాం**
**- కనుల విందుగా జరిగే బృహత్తర కార్యక్రమానికి ప్రతిఒక్కరూ ఆహ్వానితులే**
**- ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
**- భారతీయ వారసత్వ సంపద ప్రతిఒక్కరికీ చేరువకావాలి**
**- మీడియా సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

భారతీయ వారసత్వ సంపద అయిన యోగాను ప్రతిఒక్కరికీ చేరువచేయాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర–2025లో భాగంగా ఈ నెల 11వ తేదీన బెరం పార్కు వద్ద కృష్ణమ్మ ఒడిలో ఉషోదయ వేళ యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ – ఫ్లోటింగ్ యోగాతో ప్రపంచ రికార్డును సొంతం చేసుకునేలా మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డును కైవసం చేసుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. యోగాను ప్రతిఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేలా అవగాహన కల్పించి ప్రోత్సహించేందుకు పడవలపై యోగా మెగా ఈవెంట్‌కు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు వంటి 200 వాటర్ క్రాఫ్ట్స్‌పై వెయ్యిమందితో కామన్ యోగా ప్రోటోకాల్‌తో యోగాసనాలు వేయడం జరుగుతుందని వివరించారు. వరల్డ్ రికార్డ్స్ యూనియన్ కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రపంచ రికార్డుగా నమోదు చేయడం జరుగుతుందన్నారు. భానుని లేలేత కిరణాలు పరచుకొన్నవేళ ప్రకృతి రమణీయత మధ్య కనుల విందుగా జరిగే ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ ఆహ్వానితులేనని.. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగాచరణతో సంపూర్ణ ఆరోగ్యానికి చేరువై ఎన్‌టీఆర్ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంలో భాగస్వాములు కావాలన్నారు. మెగా ఈవెంట్ నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగంతో ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్యం, మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మత్స్య తదితర శాఖలతో పాటు అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ), స్విమ్మర్ల అసోసియేషన్, యోగా శిక్షణ సంస్థలు వంటివి కూడా భాగస్వాములవుతున్నాయని కలెక్టర్ తెలిపారు.పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు:యోగా విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంత ముఖ్యమో ఇలాంటి మెగా ఈవెంట్ల విషయంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవడం అంతే ముఖ్యమని.. ఈ నేపథ్యంలో గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, సుశిక్షితులైన బోట్ ఆపరేటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. బోట్లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. గౌరవ ప్రధానమంత్రి చొరవతో నేడు యోగా విశ్వవ్యాప్తమైందని, గౌరవ ముఖ్యమంత్రి నెల రోజుల వ్యవధిలో రెండు కోట్ల మందికి యోగాను నేర్పించే లక్ష్యంతో యోగాంధ్ర–2025ను ఆవిష్కరించారని.. ఇంత మంచి కార్యక్రమాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో నిత్య యోగా ద్వారా ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పది లక్షల మందికి యోగాను నేర్పించేందుకు అయిదువేల మంది సర్టిఫైడ్ ట్రైనర్లతో కృషిచేస్తున్నామని.. ఇప్పటికే ఏడు లక్షల మంది రిజిస్టర్ అయ్యారన్నారు. పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. ఇప్పటికే గాంధీ హిల్, పవిత్ర సంగమం, హరిత బెరం పార్కులో నిర్వహించామని, త్వరలో కొండపల్లి ఖిల్లాపైనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.సమావేశంలో అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డా. తరుణ్ కాకాని, జిల్లా ఆయుష్ అధికారి డా. రామత్లేహి, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు ఖాజీ 2 గా మౌల్వి మహమ్మద్ రఫి

బద్వేలు,బద్వేలు ఖాజీ 2గా మౌల్వి మహమ్మద్ రఫిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో మంగళవారం ఆయన పలువురు ముస్లిం పెద్దల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.అనంతరం టిడిపి ఇంచార్జ్ రితేష్ రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రితేష్ రెడ్డి మాట్లాడుతు బద్వేలు పట్టణంలో ముస్లిం జనాభా అధికంగా వున్న దృష్ట్యా వారి సౌకర్యార్ధం అదనంగా మరొక ఖాజీ వుంటే బాగుంటుందని తెలపడంతో,ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడమైందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి వుందన్నారు.వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు వెంగళరెడ్డి,షేక్ మహబూబ్ బాష, తెలుగుయువత కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు జహంగీర్ బాష, టిడిపి మైనారిటీ పట్టణాధ్యక్షులు ఎస్ ఎం బాష,జమాల్ వలి ( అమీర్ సాహెబ్ ), రసూల్,ఆవాజ్ నాయకులు ఎస్ ఏ సత్తార్, ఖాదర్ వలి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి లోకేష్

### పల్లా కుటుంబ సభ్యులకు పరామర్శ

విశాఖపట్నం:టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. గత శనివారం ఆయన స్వర్గస్థులయ్యారు. నేడు ఉదయం విశాఖ సీతంపేటలోని పల్లా శ్రీనివాసరావు నివాసానికి చేరుకున్న మంత్రి లోకేష్.. అక్కడ పల్లా సింహాచలం గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పల్లా సింహాచలం గారు మంచికి మారుపేరుగా నిలిచారని, విశాఖ–2 ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారని ఈ సందర్భంగా ఆయన సేవలను మంత్రి గుర్తుచేసుకున్నారు. పల్లా శ్రీనివాసరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పల్లా సింహాచలం గారి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ శ్రీ భరత్, హోంమంత్రి వంగలపూడి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## యువత క్రమశిక్షణతో కృషిచేసి లక్ష్యాన్ని సాధించాలి...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
**సి.ఎస్.ఆర్ క్లబ్ అగ్నివీర్ శిక్షణ కేంద్రం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**

రామగుండం,యువత క్రమశిక్షణతో కృషిచేసి లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గోదావరిఖనిలోని సి.ఎస్.ఆర్ క్లబ్ అగ్నివీర్ శిక్షణ కేంద్రం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అగ్ని వీర్ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు సింగరేణి సంస్థ అవసరమైన స్థలం కేటాయించిందని, అదేవిధంగా నాణ్యమైన శిక్షణ యువతకు అందించేందుకు అవసరమైన నిధులను ఎన్టిపిసి రామగుండం సంస్థ స్పాన్సర్ షిప్ చేసినందుకు కలెక్టర్ అభినందించారు.ఏప్రిల్ మాసం నుంచి నేటి వరకు ఉచిత వసతి తో కూడిన శిక్షణ 140 మంది అభ్యర్థులకు అగ్నివీర్ రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు అందించామని అన్నారు. రాబోయే రోజుల్లో వీరికి ఫిజికల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన శిక్షణ కూడా ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.అగ్ని వీర్ క్యాంపు విజయవంతంగా నిర్వహించిన సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. గత 2 నెలలుగా శిక్షణ శిబిరంలో అలవర్చుకున్న క్రమ శిక్షణ జీవితంలో కొనసాగించాలని కలెక్టర్ యువతకు సూచించారు. అందుకున్న 140 మంది అభ్యర్థులు రాత పరీక్ష లో ఎంపిక కావాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు విజయవంతంగా ఎంపిక జరిగినప్పుడే ఇటువంటి శిక్షణ శిబిరాలకు విలువ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఎన్ టి పి సి జనరల్ మేనేజర్ ప్రవీణ్ చౌహాన్, రామగుండం ఏసిపి ఎం రమేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత శాతం తగ్గడానికి కారణమైన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలి

## సాయి అనాధ ఆశ్రమాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి



కర్నూల్ లీగల్, జూన్ 10(శ్రీ చక్ర): కర్నూలులోని బుధవారపేట గల సాయి అనాధ ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ లు తనిఖీ చేశారు. న్యాయమూర్తి ఆశ్రమంలోనీ పిల్లల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనాధ ఆశ్రమంలో పరిశీలించడానికి సరైన రికార్డులు లేవని అలాగే పరిశుభ్రతను పాటించడం లేదని అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాధాశ్రమానికి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోలేదని వారిని మందలించారు. రికార్డుల ను సక్రమంగా నిర్వహించాలని, అనాధ ఆశ్రమాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలనివారుసూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డీసిపిఓ శారద, పద్మ డిస్ట్రిక్ట్ ప్రొబేషనరీ ఆఫీసర్ దివాకర్ పాల్గొన్నారు.

## పాకెట్ పార్కు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు





కర్నూలు, జూన్ 10 (శ్రీచక్ర): నగరంలోని ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీ నది ఒడ్డున డంప్ తొలగించి నిర్మిస్తున్న పాకెట్ పార్కు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పాకెట్ పార్కు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ ఆదేశాల మేరకు, హంద్రీ నది ఒడ్డున ఉన్న డంప్ తొలగించామని,ఆ స్థానం రూ.10 లక్షలతో పాకెట్ పార్కు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఫెన్సింగ్, గ్రావెల్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, పచ్చదనం పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా అంతకుముందు కమిషనర్.. వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిష్కార పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, డిఈఈలు కృష్ణలత, గంగాధర్, టిపిఈలు మహేష్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి యోగా దివ్యౌషధం నగర పాలక మేనేజర్ యన్.చిన్నరాముడు




కర్నూలు, జూన్ 10(శ్రీచక్ర): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన దివ్య ఔషధమని నగరపాలక మేనేజర్ యన్.చిన్నరాముడు తెలిపారు. మంగళవారం బిర్లా కాంపౌండ్‌లోని ఖానా-ఖజానా వద్ద 'స్ట్రీట్ యోగా' కార్యక్రమానికి ఆయన హాజరై, ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించడానికి యోగాసనాలను నిత్యం ఆచరించాలన్నారు. ప్రజలకు యోగాపై మరింత అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. నగరంలో ప్రతి సచివాలయ పరిధిలో ఉచిత యోగ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు అవినాష్ శెట్టి, మునిస్వామి, అక్షర, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో శ్రీ ఆదివారాహి దేవాలయం కూల్చివేత

తిరుపతి.తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు లో స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతం పక్కన వెలసి ఉన్న శ్రీఆదివారాహి అమ్మవారి ఆలయాన్ని దుండగులు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసారు. మంగళవారం ఉదయం 40 మంది పైచిలుకు దుండగులు ఆలయం వద్ద చేరుకొని ఆలయాన్ని ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న మహిళలపై దాడి చేసి గాయపరిచారు. ఈ దృశ్యాలని అక్కడి సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయను కోతవేటు దూరంలో ఉన్న శ్రీ ఆది వారాహి అమ్మవారి ఆలయాన్ని ధ్వంసం చేయడంపై వెంటనే పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని మహా రుద్ర వారాహి స్వామి భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ డిమాండు..



వెల్దుర్తి జూన్ 10( శ్రీ చక్ర): మండల కేంద్రంమైన వెల్దుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ జిల్లా ఉన్నత విద్య అధికారి శ్యాముల్ పాల్ గారి కీ మంగళవారం వినతి పత్రం అందించారు. గత రెండు విద్యా సంవత్సర కాలంలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా పడిపోవడంఅలాగే విద్యార్థులు క్రమశిక్షణ రాహితంగా విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరి వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓ శామ్యూల్ పాల్ గారికి వినతి పత్రం అందజేసిన అనంతరం నవీన్ మాదిగ మాట్లాడుతూ వెల్దుర్తి బాలుర ఉన్నత పాఠశాలలో గత మూడు సంవత్సరముల నుండి పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పడిపోయినది అని ఇక్కడ ఉపాధ్యాయులు హెడ్మాస్టర్ ను బాధ్యులుగా చేస్తూ వీరి మీద తగు చర్యలు తీసుకోవాలని,ఈ స్కూల్లో గ్రామంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారితోపాటు,90% దళిత విద్యార్థులు ,ఎస్సీ బాలుర హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు వీరి చదువులపై ఉపాధ్యాయులు సరిగ్గా పట్టించుకున్న పాపాన లేదు విద్యార్థుల చదువులో ప్రత్యేక శ్రద్ధ గాని, ప్రత్యేక క్లాసులు గాని నిర్వహించకుండా వారిని చదువుల్లో ప్రోత్సహించకుండా, చదువుల పట్ల విద్యార్థులకు సరిగా అవగాహన కల్పించకుండా, నిర్లక్ష్యం వహించడం వల్లే బాలుర హైస్కూల్లో ఉత్తీర్ణత శాతం పడిపోయినది, ఉపాధ్యాయ బృందాన్ని పూర్తిగా మార్చి మంచిగా చదువు చెప్పి విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి కలిగేలా అవగాహన కల్పించే ఉపాధ్యాయులను స్కూలుకు బదిలీ చేయాలని, లేదంటే ,వెల్దుర్తి బాలుర స్కూలుకు జిల్లాలోనే గాక రాష్ట్రంలోనే విద్యలో వెనుకబడిన స్కూల్ గా ప్రజల దృష్టిలో ఉంటుందని స్కూలు పునరుద్ధరించి విద్యా ఉత్తీర్ణతలో ఉపాధ్యాయులతో పాటు అధికారులు కూడా ముందుండి నడిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో వెల్దుర్తి బాలుర హై స్కూల్ ఎస్ఎంసి చైర్మన్ ముత్యాల చిన్నతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భక్తి ఉత్తమ సంస్కారములను కలిగిస్తుంది

### చల్ల కూలూరులో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు తితిదే .డాక్టర్ మల్లు వేంకట రెడ్డి





కర్నూలు, జూన్ 10 (శ్రీచక్ర): భక్తి ఉత్తమ సంస్కారములను కలిగిస్తుందని, సంస్కారవంతమైన సమాజం సుఖశాంతులతో జీవిస్తుందని, అందుకు ప్రతి ఒక్కరు బాల్యంనుండే భక్తి భావనలను అలవరచాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండలం, చల్ల కూల్లూరు గ్రామంలోని శివాలయం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమానికి ప్రారంబోపన్యాసం చేశారు. తదనంతరం సి. తులశమ్మ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూలింటి శాంతమ్మ, యం.మాధవ స్వామి, భజన మండలి అధ్యక్షులు నల్లన్న, హార్మోనిస్టు నారాయణదాసు, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, బి.నర్సప్ప, పెద్దయ్య స్వామి, అర్చకులు రామాంజనేయులు, రాముడు, జయ రాముడు, దామోదర్ నాయుడు, మహేశ్, వీరేశ్, కొండన్నతో పాటు భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లోకి జూనియర్...

విజయవాడ, జూన్ 10,ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు వచ్చినప్పుడల్లా జూనియర్ ఎన్టీఆర్ అంశం తెరపైకి వస్తుంది. తాజాగా కేకే సర్వే సంస్థలో కూడా ఎక్కువ మంది జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నట్లు తేలింది. పార్టీలకు అతీతంగా ఆయనకు మద్దతు లభిస్తుందని, అదే సమయంలో జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉందని తమ సర్వేలో తేలినట్లు కేకే సంస్థకు చెందిన సర్వే తెలిపింది. అంతే కాకుండా జూనియర్ ఎన్టీఆర్ కు పద్దెనిమిదేళ్లకు పైబడిన వారు మాత్రమే కాకుండా 42 ఏళ్లకు పైబడిన వారు కూడా రాజకీయాల్లోకి వస్తే మద్దతు తెలుపుతామని చెబుతున్నారని ఆ సంస్థ సర్వే లో వెల్లడయినట్లు కేకే సంస్థకు చెందిన కిరణ్ కోటేటి తెలిపారు. 2009 ఎన్నికల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల జోలికి రాకపోయినా ఆయన ను కావాలనుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం ఒకింత ఆశ్చర్యకరమేనని చెప్పాలి. దీంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై చర్చ జరుగుతుంది. అయితే జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఏ పార్టీకి మద్దతుదారుగా లేరు. తన తాత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా ఉన్నానంటూ పలు మార్లు ప్రకటించిన జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే ఎందులోకి వస్తారు? తెలుగుదేశం పార్టీలో ఇప్పుడయితే ఖాళీ లేదు. ఎందుకంటే నారా లోకేశ్ యువనేతగా టీడీపీలో పాతుకుపోయారు. టీడీపీ భవిష్యత్ నేతగా ఆయన ఎమర్జ్ అయ్యారు కూడా. ఆయన టీడీపీ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. రేపో మాపో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలున్నాయి. అదే సమయంలో చంద్రబాబు తర్వాత టీడీపీ వారసత్వం కూడా లోకేశ్ కు మాత్రమే చెల్లుతుంది. . ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే ఆయనకు తెలుగుదేశం పార్టీ అంటే వల్లమాలిన ప్రేమ.

## అమరావతి మహిళలను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


### వేశ్యల రాజధాని అనడం ఆడ జాతికే అవమానం కర్నూల్లో టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో రోడ్డెక్కి నిరసన తెలిపిన మహిళలు





కర్నూలు, జూన్ 10(శ్రీచక్ర): అమరావతి వేశ్యల రాజధాని అంటూ వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజు, డిబేట్ నిర్వహించిన సాక్షి టివి ఛానల్ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావులపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ కర్నూల్లో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు రోడ్డెక్కి నిరసన తెలియజేశారు. మంగళవారం శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నుండి కలెక్టరేట్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. మహిళల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ మాట్లాడుతూ వైసీపీ పేటీయం బ్యాచ్ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుందన్నారు. ఇలాంటి పాలన గత ఐదేళ్లు చూసిన తర్వాతనే ప్రజలు వైసీపీని సాగనంపారని.. ఇప్పటికైనా వైఎస్ జగన్ బుద్ధి తెచ్చుకోవాలని హితవుపలికారు. తల్లికి, చెల్లికి విలువ ఇవ్వని వ్యక్తికి మహిళల విలువ ఏం తెలుస్తుందని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి అమరావతి రైతులు 30 వేల ఎకరాలు త్యాగం చేస్తే ఆ మహిళలపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కొమ్మినేనిని అరెస్టు చేసిన విధంగానే కృష్ణంరాజును కూడా వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. వై.ఎస్ భారతిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తాడెపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామన్నారు. అనంతరం వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవలక్ష్మి మాట్లాడుతూ సాక్షి మీడియా మహిళల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతోందన్నారు. వాళ్ల ఇంట్లో మహిళల గురించి ఎవ్వరూ, ఏ రోజూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. రాజధాని అంటే ఏంటో తెలియని పరిస్థితి అప్పట్లో ఉండేదని, చంద్రబాబు అమరావతిని రాజధాని చేస్తే చూస్తూ ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.టిడిపి నగర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై ఇప్పటికే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేశామన్నారు. అమరావతి దేవతల రాజధాని అని సీఎం చంద్రబాబు నాయుడు అంటుంటే.. వీళ్లు వేశ్యల రాజధాని అంటూ మాట్లాడటం దారుణమన్నారు. మహిళలు వీళ్లకు వేశ్యల్లాగా కనిపిస్తున్నారని మండిపడ్డారు. అమరావతి మహిళలను అవమానిస్తే ఆడ జాతిని అవమానించినట్లేనన్నారు. సాక్షి ఛానల్‌లో సిగ్గు లేకుండా మహిళలను కించపరుస్తూ మాట్లాడుతున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పితీరాలన్నారు. నియోజకవర్గ అధ్యక్షురాలు మారుతీశర్మ మాట్లాడుతూ సాక్షి ఛానల్‌ను వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. భారతి రెడ్డి మహిళే కాబట్టి ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో మహిళల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వీరిపై చర్యలు తీసుకోకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రమణమ్మ, మాజీ కార్పొరేటర్లు, బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు భారీగా పెరిగిన రద్దీ



తిరుమల, జూన్ 10,వేసవి సెలవులు ముగిసి మరో నాలుగురోజుల్లో పాఠశాలలు ప్రారంభంకానుండటంతో తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. తిరుమల కొండపై ఎటుచూసిన భక్త జన సందోహమే కన్పిస్తోంది. సెలవుదినాలు కావడంతో భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో ఉన్న 31 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతోందని టీటీడీ అధికారులు వివరించారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు దర్శనానికి 6 గంటలు పడుతోంది. కల్యాణకట్టలు, లడ్డూ కేంద్రం, అఖిలాండం, అన్నప్రసాద భవనాలూ రద్దీగా మారాయి. గదులకు డిమాండ్ మరింత పెరిగిపోయింది. గదులు పొందేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరాల్సి వచ్చింది. సీఆర్వో ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. అలాగే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయిస్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసం కూడా రద్దీగా మారాయి. నిన్న స్వామివారిని 88వేల2వందల57 మంది భక్తులు దర్శించుకోగా 45వేల068 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల రూపేణ శ్రీవారి హుండీకి రూ.3.68 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈనెల 9 నుంచి 11వతేదీవరకు తిరుమలలో శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. ఏటా జ్యేష్ఠమాసంలో మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజున శ్రీ మలయప్ప స్వామివారి బంగారు కవచాన్ని తొలగించి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నానం, తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండో రోజు ముత్యాల కవచంతో స్వామిని అలంకరిస్తారు. మూడోరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచాన్ని సమర్పిస్తారు. జ్యేష్ఠాభిషేకం సందర్భంగా తిరుమలకు భక్తుల రాక మరింత పెరుగుతుందని టీటీడీ అంచనా వేస్తోంది.

## జిల్లాలో సోలార్ ప్యానల్ యూనిట్లు రిజిస్ట్రేషన్, స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలి.
### -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం జూలై 10 (శ్రీ చక్ర )ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలులో భాగంగా సోలార్ పానెల్ యూనిట్ల రిజిస్ట్రేషన్, స్థాపన ప్రగతిని మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఈ పథకం అమలు మందకొడిగా సాగడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం విస్తృత స్థాయిలో అమలు చేయడానికి రాష్ట్రంలోనే అనువుగా ఉన్న ఏకైక జిల్లా పశ్చిమగోదావరి జిల్లా అన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న జిల్లాలోనే ఈ పథకాన్ని అమలు చేయలేకపోతే రాష్ట్రంలో ఎక్కడ పెద్ద స్థాయిలో అమలు చేయలేరున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకమైన జిల్లాలో అమలు టాప్ రెండు, మూడు స్థానాల్లో ఉంటుందని అటువంటిది ప్రధాన మంత్రి సూర్యా ఘర్ యోజన పథకం జిల్లాలో నత్త నడకన నడుస్తుందన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేసి రాబోయే రెండు నెలలో రాష్ట్రంలో రెండు, మూడు స్థానాలకు చేరేలా కృషి చేయాలన్నారు. బ్యాంకు రుణం మంజూరులో ఎటువంటి జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బ్యాంక్ అధికారులును ఆదేశించారు. సోలార్ యూనిట్ల స్థాపన వల్ల కలిగే ప్రయోజనాలను విస్తృత స్థాయిలో ప్రజలలో అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్ని సమీక్ష సమావేశాలు నిర్వహించిన, క్షేత్రస్థాయిలో కార్యాచరణ లేకపోతే ఏ పథకము విజయవంతం కాదన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం విజయవంతం అయ్యేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. మంజూరైన యూనిట్లు స్థాపనలో వెండార్స్ ఎటువంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. యూనిట్ల స్థాపనలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో జిల్లా విద్యుత్ శాఖాధికారి ఏ.రఘునాథ్ బాబు, డిఇలు, ఏఇలు, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా: కంచుమర్తి.



రామచంద్రాపురం, జూన్,10( శ్రీచక్ర )రామచంద్రపురం పట్టణానికి చెందిన సామాజిక వేత్త, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కంచుమర్తి ఉమా మహేశ్వర బాబురావును నవ్యాంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిన్ వెల్ఫేర్ అసోసియేషన్ డిస్కం గౌరవ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం ఆయన ఈవిషయాన్ని తెలియజేశారు. కార్మికులు ఉద్యోగుల విషయాలలో వారికి అండగా ఉండి వారి సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసినందుకు ఉద్యోగ సంఘాలు కలిసికట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నాయి .ఈసందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , ఆయన తండ్రి సత్యం , చాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దలు , సభ్యులు, స్థానిక నేతలు, అభిమానులు తదితరులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## డ్రోన్ ల సర్వేతో భూముల సమస్యలును పరిష్కరిస్తాం
### కోట తహసీల్దార్ కటారి.జయ జయ రావు వెల్లడి



కోట జూన్ 10 (శ్రీ చక్ర): రైతుల భూముల యొక్క సర్వే ను డ్రోన్ ల సాయంతో పరిష్కరిస్తామని తహసీల్దార్ కటారి.జయ జయ రావు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం కోట మండలంలోని కర్లపూడి గ్రామంలో పలు భూములను డ్రోన్ ల ద్వారా సర్వేలను జరుపుతున్నారు.ఈ సర్వేలను కర్లపూడి, సిద్దవరం,కొత్తపట్నం గ్రామాలలో సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ కే.జే జే రావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే.జే జే రావు,వి ఆర్ ఓ శ్రీనివాసులు,డ్రోన్ ఆపరేటర్ లు ఉన్నారు

## రాయలంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి





భీమవరం జూన్ 10 (శ్రీ చక్ర) కూటమి ప్రభుత్వం లో అన్ని గ్రామాలను మోడరన్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రూ 19 లక్షలతో రాయలం పంచాయతీ కార్యాలయం, రూ 34 లక్షలతో సీసీ డ్రెయిన్ లను ప్రారంభించామని అన్నారు. గత ఐదేళ్లలో అభివృద్ధి అంటేనే కనిపించలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని వారు అన్నారు. భీమవరం నియోజక వర్గంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నామని, రానున్న రోజుల్లో భీమవరం నియోజకవర్గం ఆదర్శ నియోజక వర్గంగా చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో రాయలం గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

## సజ్జలతో పాటు అమరావతి మహిళలపై వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును అరెస్ట్ చేయాలి



కోట జూన్ 10 (శ్రీ చక్ర) : సాక్షి ఛానల్ ద్వారా అమరావతి మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజును ఆ వ్యాఖ్యలకు నిరసన తెలిపిన మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన సజ్జల రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయాలని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు.కోటలో పత్రికా ప్రకటన ద్వారా మాట్లాడుతూ వర్తమాన రాజకీయాలకతీతంగా అమరావతి ప్రాంతం దేవతలకు నిలయమనన్న చరిత్ర చెపుతున్న నేపథ్యంలో ఆ అమరావతిని నవ్యాంధ్రకు రాజధానిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంపిక చేసినప్పటినుండి వైకాపా రాక్షస మూకలు అమరావతి రాజధాని పట్ల చేసిన, చేస్తున్న విమర్శలు వ్యాఖ్యానాలు, ఆరోపణల గురించి అందరికీ తెలిసిందే అని అన్నారు.దీనికి కొనసాగింపుగా బరితెగించి సాక్షి ఛానల్ లో యాంకర్ స్థానంలో కొమ్మినేని శ్రీనివాసరావు వ్యాఖ్యాతస్థానంలో కృష్ణంరాజు అనే జర్నలిస్టులు అమరావతి రాజధాని దేవతలకు నిలయం కాదని వేశ్యలకు నిలయం అంటూ చేసిన పలకలేని అభ్యంతరకరమైన వ్యాఖ్యల పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం అవుతున్న క్రమంలో ఆ వ్యాఖ్యల పట్ల నిరసన తెలిపిన తెలుపుతున్న మహిళల గురించి అప్పటి వైకాపా ప్రభుత్వం లో సలహాదారుగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసాయన్నారు. సాక్షి ఛానల్ లో వ్యక్తమైన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపిన, తెలుపుతున్న మహిళలను రాక్షసులు, పిశాచాలతో సంకరజాతి వారు కలవడంతో ఏర్పడిన తెగ వారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించడం క్షమించరానిదన్నారు. సాక్షి ఛానల్ లో అమరావతి మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు కృష్ణంరాజులపై రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు అంది కేసులు నమోదవుతున్న పరిస్థితిలో కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన స్థితిలో సజ్జల రామకృష్ణారెడ్డి పై కూడా సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అలాగే జర్నలిస్ట కృష్ణంరాజును కూడా ఎక్కడున్నా గాలించి అరెస్టు చేయాలని తద్వారా మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయాలనుకున్న వారికి వెన్నులో వణుకు పుట్టేలా కఠిన చర్యలు చేపట్టాలని రాధాకృష్ణారెడ్డి కోరారు

## వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట దర్నాను విజయవంతం చెయ్యండి.
### ఎంపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజబాబు.



కాజులూరు, జూన్ 10(శ్రీచక్ర)రాష్ట్రంలో రైతాంగం పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ వైకరిని నిరశిస్తూ బుధవారం రాష్ట్ర వ్యావసాయు శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘాల ఆద్వర్యంలో చేపట్టనున్న దర్నా కార్యాక్రమాన్ని ప్రజలు విజయవంతం చెయ్యాలని ఏపి కౌలురైతుసంఘం జిల్లా ప్రధాన కార్యాదర్శి వల్లు రాజబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం రాజబాబు తదితర కౌలురైతు సంఘాల నాయుకులు మండలంలోని కోలంక, పల్లిపాలెం, నామవానిపాలెం తదితర గ్రామాలలో పర్యటించి దర్నా కార్యాక్రమంలో హాజరుకావలసిందిగా రైతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లిపాలెంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో కౌలురైతుల సంక్షేమంకోసం నూతన చట్టాలను తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఏడాది గడుస్తున్నా రైతుల అభివృద్ధికోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం నేటికి కార్యారూపం దాల్చలేదని, రైతు సేవాకేంద్రాలు ఉత్సవిగ్రహాలుగా మారాయన్నారు. కనీసం ప్రభుత్వం సీఎంఆర్ ద్వారా సక్రమంగా దాన్యం కొనుగోలు చెయ్యకపోవటంతో రైతులు దళారులకు అయినకాడికి అమ్ముకోవలసి వచ్చిందన్నారు. ఒట్లు కోసం ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలిచ్చిన పాలకులు 'ఓడదాటేవరకూ ఓడమలయ్య. ఓడ దాటాక బోడిమల్లయ్య' అన్న సామెతల వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య విదానాలను నిరశిస్తూ చేపట్టిన ఈ దార్నా కార్యక్రమాన్ని రైతులందరూ విజయవంతం చెయ్యాలన్నారు.

## రామచంద్రపురం శ్రీ చైతన్య విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



రామచంద్రపురం, జూన్ 10 (శ్రీచక్ర)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విడుదల చేసిన యస్ యస్ సి 2025 ప్రతిభ అవార్డులలో స్థానిక రామచంద్రపురం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఐదుగురు ప్రతిభ అవార్డులను కైవసంచేసుకున్నారని ప్రిన్సిపాల్ కె .రాము తెలిపారు. ఈ సందర్భంగా అమలాపురం కలెక్టర్ ఆఫీస్ లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలను అందుకున్నారు. తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించడంతో పాటు ఇటువంటి ప్రతిభా అవార్డులు కైవసం చేసుకోవడం గర్వంగ అన్నారు. ఈ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థికి కలెక్టర్ చేతుల మీదుగా 20 వేల నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్ మరియు మెడల్ అందజేశారు.తమ పిల్లలకు ఈ అవార్డులు రావడానికి శ్రీ చైతన్య కరిక్యులమ్ ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు మరియు వాళ్ళ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుబీర్ గ్రామంలో రోడ్డుపై పారుతున్న వరద నీరు
### తక్షణమే శుభ్రపరుస్తామని హామీ ఇచ్చిన కుబీర్ మండల ఎంపీడీవో, ఎంపీఓ



కుబీర్, జూన్ 10(శ్రీచక్ర): కుబీర్ గ్రామంలో నిన్న రాత్రి 10 గంటలకు కురిసిన కేవలం ఒక గంట వర్షానికే,మురికి కాలువలు శుభ్రంగా లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చాయని, అలాగే విట్టలేశ్వర మందిర ప్రాంగణంలోకి,గ్రామంలోని శిల్పా కళాధామం వద్ద మురికి కాలువ చెత్తాచెదారంతో నిండుక పోవడంతో, ఇండ్లలోకి వరద నీరు వచ్చాయని మహిళలు వాపోతున్నట్టు, వర్షాకాల ప్రారంభంలోనే ఇలా ఉంటే, తర్వాత వరద నీటి తీవ్రత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి కుబీర్ మండల ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డికి, ఎంపీపీ గంగా మోహన్కు వివరించగా, అధికారులు తక్షణమే మురికి కాలువలను శుభ్రపరుస్తామని,ఇకపై వీటి సమస్య ఉండకుండా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంపతి, వద్నప్ లక్ష్మణ్, మహిళలు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

## నందమూరి బాలకృష్ణ మృధుస్వభావి...,అటూ ప్రేక్షకులకు, ఇటూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో...



కోట జూన్ 10 (శ్రీచక్ర) : సినీ హీరో,హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మృధుస్వభావి, అటూ ప్రేక్షకులుకు అందుబాటులో ఉండడం మరోప్రక్క రాజకీయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించడం మర్చిపోలేనిదని సీనియర్ టీడీపీ నాయకులు మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా మంగళవారం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్బంగా మారంరెడ్డి.శ్రీధర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ గతంలో ఆయన్ను కలిసిన ఫొటోను జ్ఞాపకార్థంగా ప్రదర్శించి అభిమానాన్ని చాటుకున్నారు.అంతేకాకుండా బాలకృష్ణ సినీ హీరో కాకుండా నిత్యజీవితంలో కూడా హీరోగా ఉన్నారని అభివర్ణించారు. నిరంతరం సినీ పరిశ్రమలో ప్రజలుకు అందుబాటులో ఉండి మానసిక ఉల్లాసాన్ని అందిస్తూ... అదేవిధంగా ప్రజలకు సేవ చేయాలనే దృక్పధంతో ఎమ్మెల్యే గా ఉంటున్నారని మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి చెప్పారు.

## కోట కు ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రీతి రెడ్డి రాక

కోట జూన్ 10 (శ్రీ చక్ర) : ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ప్రీతి రెడ్డి ప్రతినెలా రెండవ బుధవారం కోట ఎన్ సి ఆర్ నగర్ లోని జనతా క్లినిక్ ఆసుపత్రి కు వస్తారని జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్.జగదీష్, డాక్టర్ ఉమేరా లు తెలిపారు.అదేవిధంగా 11 వ తేది బుధవారం ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఒకవేళ ఎవరైనా అపాయింట్మెంట్ కొరకు 9642414572, 9738577366 నెంబర్ లను సంప్రదించాలని తెలియజేశారు.

## విశాఖపట్నంలో ఫాప్సీ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్

విశాఖపట్నం, జూన్ 10(శ్రీచక్ర): విశాఖపట్నంలో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ మరియు ఇండస్ట్రీస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ పాల్గొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తమ ఎన్డీఏ ప్రభుత్వం 11 నెలల్లో రూ.9.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఏపీకి ఆకర్షించిందన్నారు. ఇది మామూలు విషయం కాదని.. గత ప్రభుత్వం ఐదేళ్లలో సాధించలేని విజయమన్నారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే ఇంత భారీ మొత్తంలో పెట్టుబడులు తీసుకొచ్చిందంటే ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి ఉంటుందో ప్రజలందరూ ఒక్కసారి తెలుసుకోవాలన్నారు. ఈ పెట్టుబడులన్నీ గ్రౌండింగ్ అయ్యాక ఫలితాలు అందరికీ కనిపిస్తాయన్నారు. తమ ప్రభుత్వం పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగిస్తోందని తెలిపారు. సీబీఎన్ బ్రాండ్తో ఏపీని అభివృద్ధివైపు తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



# మహిళలను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలంటూ భారీ ప్రదర్శన

**సాక్షి యాజమాన్యం మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి మానవహారం చేసి సాక్షి ప్రతులు చింపివేత. రామచంద్రపురంలో కదం తొక్కిన మహిళలు**








రామచంద్రపురం, జూన్,10(శ్రీచక్ర)అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించడంతోపాటు, సాక్షి యాజమాన్యం మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని రామచంద్రపురం నియోజకవర్గం మహిళా నాయకులు డిమాండ్ చేస్తూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక లైన్స్ క్లబ్ కళ్యాణ మండపం వద్ద ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించి సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి, సాక్షి ప్రతులను చింపివేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు జాస్తి విజయలక్ష్మి, గజలక్ష్మి, బల్లా లక్ష్మి, నెక్కంటి జానకి లక్ష్మి, వంజరపు రాజేశ్వరి తదితరులు మాట్లాడుతూ స్త్రీ పవిత్రతను, అమ్మతనాన్ని అవమానించిన సాక్షి వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి పట్ల జరుగుతున్న కుట్రలో భాగమేనని ఆరోపించారు. మాతృమూర్తులను అవమానిస్తే సాక్షి యాజమాన్యం భారతి రెడ్డి, జగన్ రెడ్డి కనీసం క్షమాపణలు చెప్పకపోగా నిందితులకు అండగా ఉండడం బాధాకరం అన్నారు. ఆస్తికోసం కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన వ్యక్తికి మహిళల త్యాగాలు, గొప్పతనం తెలియవు అని, మహిళల గౌరవాన్ని కించి పరిచే విధంగా తన సొంత మీడియా సాక్షి పత్రికల్లో ప్రచురింప చేస్తున్న జగన్ రెడ్డి, భారతీరెడ్డిలు మహిళల త్యాగాలను గొప్పతనాన్ని ఎన్నటికీ తెలుసుకోలేరని అన్నారు. అమరావతిని, అక్కడి మహిళలను కించపరుస్తూ జుగుప్సాకరంగా మాట్లాడిన వారు అసలు మనుషులేనా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళల్ని ఘోరంగా అవమానించడం జగన్ సహా వైకాపా నేతల పైశాచికానందానికి పరాకాష్టని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి దేవతల కొలువున్న ప్రాంతం కాదని వేశ్యలు ఉన్న ప్రాంతమని జగన్ రెడ్డి, భారతి రెడ్డిల సాక్షి మీడియా ప్రచురించడం సిగ్గుచేటన్నారు. మహిళల్ని అవమానపరుస్తూ చేసిన వాక్యలు క్షమించరానివని, ఇటువంటి కుట్ర రాజకీయాలకు పాల్పడిన నేరానికి జగన్ రెడ్డి, ఆయన సతీమణి భారతీ రెడ్డి మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కృష్ణంరాజును వెంటనే అరెస్టు చెయ్యాలని, కొమ్మినేని లాంటి ఉన్మాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గంలోని పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# రహదారి ఇరువైపులా మొక్కలు నాటించిన సర్పంచ్ నాగిరెడ్డి.పచ్చదనం -పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన.






రామచంద్రపురం, జూన్ 9 (శ్రీచక్ర)వికసిత భారత్-స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ,స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా రామచంద్రపురం మండలం హసన్ బాధ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపుల ప్రొక్లైనర్ తో చెత్తను తొలగించి మొక్కలను నాటారు.గ్రామంలో చెత్తను రోడ్ ప్రక్కన వెయ్యోద్దని,తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి విడివిడిగా క్లాప్ మిత్రలకు అందించవలసిందిగా గ్రామస్తులను సర్పంచ్ ఈసంధర్బంగా కోరారు.బిజెపి నాయకులు దొంతంశెట్టి ఓం ప్రకాష్, శివాలయం అర్చకులు ఉండి సుబ్బారాయుడు,హసన్ బాద జనసేన నాయకులు జెడ్పీపి హై స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ జాన మల్లిబాబు,హసన్ బాద టీడీపీ నాయకులు తిరగటి సత్యనారాయణ,వార్డ్ సభ్యులు చొడిశెట్టి పాండు రంగారావు,కంచి శ్రీను పంచాయతీ కార్యదర్శి కాశి రాకేష్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని హసన్ బాద వెల్ఫేర్ హాస్టల్ వద్ద శ్రీమొక్కలను నాటారు.

# జూలై 9వ తేదీన జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.




వీరవాసరం జూన్ 10 : శ్రీ చక్రఉద్యోగ కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జూలై 9 వ తేదీన సమ్మె జరుగుతుందని సిఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు తెలియచేశారు. స్థానిక ఉపాధ్యాయ సంఘం ఆఫీసులో జరిగిన సమావేశానికి రైతు సంఘం నాయకులు బాలం విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పనిగంటలు, కనీస వేతనాలు, ఈఎస్ఐ పిఎఫ్ వంటి అనేక విషయాలలో నష్టం చేసే విధంగా లేబర్ కోడ్లను రూపొందించారని దీనివల్ల ఉద్యోగ కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఇప్పటికే పరిశ్రమలలో కార్మికులకు భద్రత లేకుండా పోయిందని, ప్రమాదాలకు గురవుతున్న కార్మికులకు తగిన విధంగా వైద్యం, నష్టపరిహారం అందడం లేదని అన్నారు. కార్మిక శాఖను కార్మికుల సంక్షేమం కోసం కాకుండా యాజమాన్యాలకు ఊడిగం చేసే విధంగా మార్పు జరుగుతుందని అన్నారు. తక్షణమే లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 11 ఏళ్ళ కేంద్ర బిజెపి పాలనలో దేశంలో ఉన్న అన్ని తరగతుల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గం మరో పోరాటానికి సిద్ధమైందని తెలియజేశారు. జూలై 9వ తేదీన జరుగుతున్న సమ్మెలో అన్ని తరగతుల కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు డి వరలక్ష్మి, నాగ పార్వతి, తులసి, వెంకటలక్ష్మి తదితరులు మాట్లాడారు.

# ప్రత్యేకమైన జనాభా నిర్వహణ విధానం రూపొందించేందుకు సర్వే

**ప్రజాభిప్రాయం ప్రతిబింబించే విధంగా సర్వే ను నిర్వహించాలి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**





కర్నూలు, జూన్ 10 (శ్రీచక్ర): భవిష్యత్తు తరాలకు మంచి సమాజాన్ని అందించేందుకు ప్రత్యేకమైన జనాభా నిర్వహణ విధానం రూపొందించేందుకు సర్వే నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ - 2025) పై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు, స్టాటిస్టికల్ ఆఫీసర్ల తో కలెక్టర్ అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా నిర్వహణ విధానం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ పేపర్ ను విడుదల చేయడం జరిగిందన్నారు... జనాభా గణనీయంగా తగ్గుముఖం పట్టే ట్రెండ్ లో ఉందని, అందువల్ల ముఖ్యమంత్రి ముందు చూపుతో మేలుకొలుపు లాగా ఈ కార్యక్రమం తీసుకొని వచ్చారన్నారు. సాధారణంగా జనాభా పెరగడానికి గాని లేదంటే తగ్గడానికి గాని వివిధ రకాల కారణాలు ఉంటాయన్నారు.. 2025 సంవత్సరంలో భారతదేశంలో 141 కోట్ల జనాభా ఉందని, ఇదే బర్త్ రేట్ తో కొనసాగినట్లయితే 2061 సంవత్సరంలో 165 కోట్ల జనాభా ఉందని, 2100 సంవత్సరం నాటికి 144 కోట్ల జనాభా కు వస్తుందన్నారు... పెళ్లి చేసుకోకుండా ఉండడం, 30 సంవత్సరాలు వయస్సు పైన పెళ్లి చేసుకోవడం, లైఫ్ ఎక్స్పెక్టెన్సీ పెరిగిపోవడం ఇందుకు కారణాలు అని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రాఫ్ట్ డాక్యుమెంటేషన్ లో ఇచ్చిన ఇండికేటర్ల ప్రకారం 2011 - 15 సంవత్సర కాలంలో జనాభా పెరుగుదల రేటు 7.1 శాతం ఉంటే 2031 - 35 కి 0.3 శాతం కి వస్తోందన్నారు... క్రూడ్ బర్త్ రేట్ ( ముడి జనన రేటు ) 2011 - 15 సంవత్సర కాలంలో క్రూడ్ బర్త్ రేట్ ( ముడి జనన రేటు ) 15.2 శాతం ఉంటే 2031 - 35 కి 9.9 శాతంకి వస్తోందన్నారు. 2011 - 15 సంవత్సర కాలంలో మరణాల రేటు 7.8 శాతం ఉంటే, 2031 - 35 కి 9.5 శాతం కి వస్తోందన్నారు. 2011 - 15 సంవత్సర కాలంలో సంతానోత్పత్తి రేటు 1.68 శాతం నుండి ఇప్పటికి 1.51 ఉందన్నారు. జనన రేటు తగ్గడం, పెళ్ళి చేసుకునే వయసు పెరగడం వల్ల జనాభా తగ్గిపోతోందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా 9 ప్రశ్నలు ఇవ్వడం జరిగిందని, వాటి ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించాలని కలెక్టర్ ఎంపీడివోలను ఆదేశించారు.. మండల స్థాయిలో సమావేశాలను నిర్వహించుకోవాలని కలెక్టర్ తెలిపారు..ప్రజాభిప్రాయం ప్రతిబింబించే విధంగా సర్వే ను నిర్వహించాలన్నారు. నామ మాత్రానికి సర్వే మాత్రమే చేయకుండా మంచి జనాభా నిర్వహణ పాలసీ తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.. మంచి సూచనలు ఇచ్చిన వారికి అవార్డ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాల క్రిందట ప్రతి ఇంటిలో ఐదు నుండి పదిమంది సంతానం ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి కనపడటం లేదని తెలిపారు. ప్రస్తుతం ఫెర్టిలిటీ రేటు 1.8 ఉన్నదని కానీ ఉండాల్సింది 2.1 అని తెలిపారు. యువత తమ సంపాదన కొరకు, జీవితంలో స్థిరపడానికి వివాహాన్ని వాయిదా వేసుకోవడం లేదా ఆలస్యంగా చేసుకోవడం, ఆ తరువాత వివాహ వయసు 30 సంవత్సరాలు దాటటం వలన ఫర్టిలిటీ రేటు తగ్గిపోతూ ఉందని తెలిపారు. ఆ తర్వాత కూడా ఒకరికి మాత్రమే జన్మ నివ్వడం వంటి కారణాలవల్ల జనాభా పూర్తిగా తగ్గిపోతూ ఉందని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది ప్రశ్నలను మండలాలకు గ్రామాలకు చేరవేసి జనాభా నిర్వహణ విషయంపై ఎంపీడీవోల ద్వారా సరైన సమాధానం మరియు తగు సూచనలు మండల , గ్రామాల ప్రజల నుండి సేకరించుకుని ప్రభుత్వానికి నివేదించి జనాభా పెరుగుదలకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.కర్నూలు మున్సిపల్ మిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ నాలుగు తరాలు ఉన్న కుటుంబ వ్యవస్థ వలన సమాజానికి చాలా మేలు జరుగుతుందని వ్యక్తం చేశారు.1872 నుండి జనాభా లెక్కల సేకరణ జరుగుతూ ఉన్నదని 1951లో 36 కోట్లు గా ఉన్న భారతదేశ జనాభా ఇప్పుడు 2025 దాదాపు 140 కోట్లకు చేరుకున్నదని తెలుపుతూ, ఒకప్పుడు ప్రతి ఇంటిలో దాదాపు పది మంది సంతానం ఉండేవారని క్రమేపి ఐదు , మూడు , రెండు,ఒకటి గా మారి ఇప్పుడు పిల్లలే అవసరం లేదనే స్థాయికి యువత చేరుతూ ఉన్నదని ఇది సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని తెలిపారు. వారు ఆ విధంగా ఆలోచనలను చేయకుండా వారికి అన్ని ప్రోత్సకాలు అందజేసి సంతాన అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఉన్నదని తెలిపారు.అనంతరం ఇన్చార్జి డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిఎంఅండ్హెచ్ఓ శాంతి కళ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ హిమ ప్రభాకర్ రాజు, ఐ సి డి ఎస్ పిడి నిర్మల, సీఈఓ సెట్కుర్ వేణుగోపాల్ జనాభా నిర్వహణ విధానం పై ప్రసంగించారు. సమావేశంలో పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, మెప్మా పిడి నాగశివ లీల, టూరిజం అధికారి విజయ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా దేశీయోత్పత్తిని వచ్చే ఏడాదికి 50.711 కోట్లకు పెంచేలా బ్యాంకర్లు సహకరించండి

**జిల్లాలో పశు సంపదను అభివృద్ధి చేసేలా ఋణాలు మంజూరు చేయండి**
**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వాలి**
**కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు అందించండి**
**పిఎం సూర్య ఘర్ పథకం పై పెద్దఎత్తున అవగాహన కల్పించండి**
**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**







నంద్యాల, జూన్, 10 :-జిల్లా దేశీయోత్పత్తి 2024-25 కు రూ.43,630 కోట్ల మేరకు సాధించడం జరిగిందని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 కు రూ.50,711 కోట్ల మేరకు పెంచేలా బ్యాంకర్లు సహాయ సహకారాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పై జిల్లా కమ్యూలేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహారావు, ఎల్డిఎం రవీంద్ర కుమార్, పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ సుధాకర్, జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, ఆర్బీఐ ప్రతినిధి రామకృష్ణ, లీడ్ బ్యాంకు రీజినల్ అధికారి పి.నరసింహా రావు, నాబార్డు డిడిఎం అన్ని బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి స్థూల దేశీయోత్పత్తిని పెంచడానికి రానున్న ఐదు సంవత్సరాల్లో చేయాల్సిన ప్రణాళికలు రూపొందించడంతో పాటు 2047 నాటికి ప్రతి సంవత్సరం 15 శాతం పెంచడం ద్వారా స్వర్ణాంధ్ర సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. జిల్లా దేశీయోత్పత్తిని 2024-25 కు రూ.43,630 కోట్ల మేరకు సాధించడం జరిగిందని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 కు రూ.50,711 కోట్ల మేరకు పెంచేలా బ్యాంకర్లు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో ఎక్కువ శాతం తలసరి ఆదాయం ఉన్న మహానంది మండలం ఉందని అన్ని మండలాలు కూడా తలసరి ఆదాయం పెంచేలా కూడా తోడ్పాటును ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో పశు సంపదను పెద్ద ఎత్తున పెంచడానికి ఒక పశువు ఉన్న వారికి రెండవది, రెండు ఉన్న వారికి మూడవది, మూడు పశువులు ఉన్న వారికి నాలుగు కొనుగోలు చేసేలా బ్యాంకర్లు చేయూత ఇవ్వడం ద్వారా జిల్లాలో పశుసంపద పెరిగే అవకాశం ఉంటుందన్నారు.జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పెద్ద ఎత్తున ఋణాలు మంజూరు చేయడం ద్వారా జిల్లా పారిశ్రామికపరంగా పురోగతి సాధించే అవకాశం ఉంటుందన్నారు. కౌలు రైతులకు పెద్దఎత్తున సిసిఆర్సి కార్డులు మంజూరు చేయడం ద్వారా వారికి ఋణ సదుపాయం ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయం అందజేసి అవకాశం ఉంటుందన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం సూర్య ఘర్, పిఎం విశ్వకర్మ పథకాలకు బ్యాంకర్లు తప్పనిసరిగా చేయూతను అందజేయాలన్నారు. పిఎం సూర్య ఘర్ ఏర్పాటు చేసుకోవడానికి గాను బ్యాంకర్లు కూడా ఋణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లాలో ఇప్పటి వరకు 485 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో వంద శాతం పిఎం సూర్య ఘర్ సోలార్ ఫలకాలు ఏర్పాటు చేయడానికి పాండురంగాపురం గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందుకు సదురు మండలానికి కేంద్ర ప్రభుత్వం నుండి కూడా కోటి రూపాయలు తోడ్పాటు అందజేయడం చేయాలన్నారు.మహానంది మండలంలో సుగంధ అరటి పండ్లు ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని, అదే విధంగా ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా నాబార్డుకు సాకారం అందజేయాలన్నారు.


# స్పోర్ట్స్ న్యూస్

# అంతర్జాతీయ క్రికెట్‌కు విండీస్ విధ్వంసక బ్యాటర్ నికోలస్ పూరన్ గుడ్‌బై




అంతర్జాతీయ క్రికెట్ నుంచి మరో స్టార్ ప్లేయర్ తప్పుకున్నాడు. వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ మూడు ఫార్మట్లకు వీడ్కోలు పలికాడు. 29 ఏండ్ల వయస్సులోనే రిటైర్మెంట్ ప్రకటించి క్రికెట్ ప్రపంచానికి షాకిచ్చాడు. విండీస్ వికెట్ కీపర్-బ్యాటర్ నికోలస్ పూరం అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. అయితే ఫ్రాంచైజ్ క్రికెట్‌లో మాత్రం కొనసాగుతానని వెల్లడించారు. దక్షిణాఫ్రికా క్రికెటర్ హెన్రిచ్ క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటించిన కొన్ని రోజుల వ్యవధిలోనే పూరన్ అంటర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవడం విశేషం. ఈమేరకు పూరన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని, అయినప్పటికీ చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా అని రాసుకొచ్చాడు.'చాలా ఆలోచించిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నా. తాము ఎంతో ఇష్టపడే ఈ ఆట చాలా ఇచ్చింది. ఇస్తూనే ఉంటుంది. వెస్టిండీస్ ప్రజలకు ప్రాతినిధ్యంవహించే అవకాశం ఎంతో ఆనందాన్ని, మరపురాని జ్ఞాపకాలు మిగిల్చింది. ఆ మెరూన్ రంగు ధరించడం, జాతీయగీతం కోసం నిలబడటం, మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ పూర్తిస్థాయిలో ప్రదర్శన ఇవ్వడం. నిజంగా మాటల్లో చెప్పడం కష్టం. కెప్టెన్‌గా జట్టును నడిపించడం నేను ఎల్లప్పుడూ గుర్తుంచుకునే గౌరవం' అని రాసుకొచ్చారు. నాపై చూపిన అమితమైన ప్రేమకు ధన్యవాదాలు, కష్ట సమయాల్లో నావెంటే ఉన్నారంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రయాణంలో నాతో కలిసినందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకం, మద్దతు తనను ముందుకు నడిపించాయని చెప్పారు.విండీస్ తరఫున 61 వన్డేలు ఆడిన ఈ లెఫ్ట్ హాండ్ బ్యాటర్ 1983 రన్స్ చేశాడు. వాటిలో 3 సెంచరీలు ఉన్నాయి. 106 టీ20ల్లో 2275 పరుగులు చేశాడు. ఇటీవల ఐపీఎల్ 2025 సీజన్‌లో తన పవర్ ఏంటో చూపించారు. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ గ్రౌండ్‌లో సిక్సర్ల వర్షం కురిపించాడు. 14 మ్యాచ్‌ల్లో దాదాపు 200 స్ట్రైక్ రేట్‌తో 524 పరుగులు సాధించాడు. విడీస్ టీ20 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన పూరన్.. మరో 8 నెలల్లో పొట్టి ప్రపంచకప్ ఉండగా తప్పుకోవడం గట్టి ఎదురుదెబ్బేనని చెప్పొచ్చు.

# ఆ నలుగురు ఔట్.. లక్నో సూపర్ జెయింట్స్ వదిలేసే ఆటగాళ్ల జాబితా ఇదే!



ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తీవ్రంగా నిరాశపరిచింది. పేలవ ఆటతీరుతో ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది. 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలు మాత్రమే నమోదు చేసి ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చిన రిషభ్ పంత్ దారుణంగా విఫలమయ్యాడు. అతనితో పాటు ఇతర ఆటగాళ్ల వైఫల్యం లక్నో విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే జట్టు బలహీనతలపు అధిగమించడంపై లక్నో సూపర్ జెయింట్స్ ఫోకస్ పెట్టింది. ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు జట్టుకు భారంగా మారిన ఓ ఐదుగురు ఆటగాళ్లను వదిలేసే అవకాశం ఉంది.లక్నో సూపర్ జెయింట్స్ తమ కెప్టెన్ రిషభ్ పంత్‌నే వేలంలోకి వదిలేసే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్ల ఆల్‌టైమ్ రికార్డ్ ధరకు కొనుగోలు చేసిన లక్నో సూపర్ జెయింట్స్.. అతనికి సారథ్య బాధ్యతలు కూడా అప్పగించింది. కానీ అతను మాత్రం 14 మ్యాచ్‌ల్లో 24.45 సగటు 133.17 స్ట్రైక్‌రేట్‌తో 269 పరుగులు చేసింది. ఇందులో ఓ సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ ఉంది. తమ ఆఖరి మ్యాచ్‌లో పంత్ శతకంతో చెలరేగాడు. కానీ ఈ మ్యాచ్‌లోనూ ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మరోవైపు కెప్టెన్‌గా కూడా రిషభ్ పంత్ విఫలమయ్యాడు. భారీ ధర నేపథ్యంలో అతన్ని వేలంలోకి వదిలేసి తక్కువ ధరకు మళ్లీ తీసుకునే ప్రయత్నం కూడా చేయవచ్చు.ప్రతిభావంతమైన పేసర్ అని, అత్యంత వేగంతో బౌలింగ్ చేయగలిగే సామర్థ్యం ఉందని మాయంక్ యాదవ్‌కు లక్నో సూపర్ జెయింట్స్ గత మూడు సీజన్లుగా అండగా నిలుస్తోంది. అతను మాత్రం జట్టుకు భారంగానే మారాడు. తరుచూ గాయాల బారిన పడుతూ జట్టుకు దూరమవుతున్నాడు. ఎక్స్‌ట్రా పేస్‌ను రాబట్టే విషయంలో ఎక్స్‌ట్రా ఎఫర్ట్ పెడుతూ గాయాల బారిన పడుతున్నాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 11 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకోగా.. అతను రెండు మ్యాచ్‌లు ఆడి రెండు వికెట్లు మాత్రమే తీసి గాయంతో జట్టుకు దూరమయ్యాడు. తరుచూ గాయాల బారిన పడుతున్న మయాంక్ యాదవ్‌కు వచ్చే సీజన్ ముంగిట లక్నో గుడ్‌బై చెప్పే అవకాశం ఉంది.ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ.7.50 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన డేవిడ్ మిల్లర్ సైతం తీవ్రంగా నిరాశపరిచాడు. 11 మ్యాచ్‌లు ఆడిన అతను 30.60 సగటుతో 153 పరుగులే చేశాడు.అతని అత్యధిక స్కోర్ 27 పరుగులు మాత్రమే. విధ్వంసకర ఫినిషర్‌గా గుర్తింపు పొందిన మిల్లర్.. ఈ సీజన్‌లో తన బాధ్యతను నిర్వర్తించలేకపోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో ఆటగాడిని లక్నో తీసుకోవచ్చు.మాయంక్ యాదవ్ తరహాలోనే తరుచూ గాయల బారిన పడి జట్టుకు దూరమవుతున్న మోహ్‌సిన్ ఖాన్‌ను కూడా లక్నో వదిలేసే అవకాశం ఉంది. రూ. 4 కోట్లకు మోహ్‌సిన్ ఖాన్‌ను తీసుకోగా.. అతను సీజన్ ఆరంభానికి ముందే గాయంతో జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతని స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకున్నారు. గాయాల బెడద నేపథ్యంలో మోహ్‌సిన్ ఖాన్‌కు కూడా లక్నో ఉద్వాసన పలికే ఛాన్స్ ఉంది.

# మహిళా అంపైర్‌తో దురుసు ప్రవర్తన.. అశ్విన్‌కు భారీ జరిమానా!

టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌పై తమిళనాడు ప్రీమియర్ లీగ్(టీఎన్‌పీఎల్) లీగ్ నిర్వాహకులు కఠిన చర్యలు తీసుకున్నారు. మహిళా అంపైర్ వెంకటేశన్ కృతిక నిర్ణయాన్ని తప్పుబడుతూ అశ్విన్ దరుసుగా ప్రవర్తించాడు. అంపైర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ వాగ్వాదానికి దిగడంతో పాటు అసహనంతో గట్టిగా అరుస్తూ.. తన బ్యాట్‌తో ప్యాడ్లను కొట్టుకున్నాడు. బౌండరీ లైన్ దగ్గరకు రాగానే తన చేతి గ్లోవ్స్‌ను గ్యాలరీలోకి విసిరికొట్టాడు.




ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కాగా.. అశ్విన్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎన్నో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు ఆడిన అశ్విన్.. ఓ చిన్న లీగ్ మ్యాచ్ కోసం మహిళా అంపైర్‌తో అనుచితంగా ప్రవర్తించడం సరికాదని నెటిజన్లు అభిప్రాయపడ్డారు.దిండిగల్ డ్రాగన్స్, తిరుప్పూర్ తమిళియన్స్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రాగన్స్‌కు సారథ్యం వహిస్తున్న అశ్విన్ ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. సాయి కిశోర్ వేసిన ఐదో ఓవర్ ఐదో బంతిని అశ్విన్ ప్యాడల్ స్వీప్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బంతిని అంచనా వేయడంలో అశ్విన్ విఫలమవ్వడంతో ప్యాడ్‌ను తాకింది. బౌలర్ అప్పీల్ చేయగానే అంపైర కృతిక ఔటిచ్చింది. అయితే బంతి లెగ్ స్టంప్ బయట పిచ్ అయినట్లు రిప్లేలో స్పష్టమైంది. తొలి ఓవర్‌లోనే వైడ్స్ కోసం రెండు రివ్యూలు వృథా చేయడంతో అంపైర్‌ను సవాల్ చేసే అవకాశం అశ్విన్‌కు లేకపోయింది. దాంతో అతను అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు.ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించిన మ్యాచ్ రిఫరీ అశ్విన్ మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించాడు. టోర్నీ రూల్స్ ప్రకారం అంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకించినందుకు 10 శాతం, గ్లోవ్స్‌ను విసిరేసినందుకు 20 శాతం కోత విధిస్తూ చర్యలు తీసుకున్నాడు. తన తప్పిదాన్ని మ్యాచ్ రిఫరీ ముందు అశ్విన్ అంగీకరించాడు. యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలవాల్సిన అశ్విన్ హద్దులు ధాటి ప్రవర్తించ కూడదని నెటిజన్లు సూచిస్తున్నారు.

# టీ20 క్రికెట్‌లో అరుదైన రనౌట్.. మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్‌లో ఘటన..



ముంబై: మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్‌లో అరుదైన రనౌట్ ఘటన చోటుచేసుకున్నది. టీ20 టోర్నీలో పునేరి బప్పా, రాయిగడ్ రాయల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన జరిగింది. పునేరి జట్టు కీపర్ సూరజ్ షిండే.. అద్భుతమైన త్రో చేశాడు. అయితే ఆ బంతి రెండు వైపుల ఉన్నట్లు వికెట్లను తాకింది. స్ట్రయికర్‌తో పాటు నాన్ స్ట్రయికర్ ఎండ్‌లోనూ బంతి వికెట్లను కూల్చింది. ఈ యాక్షన్‌లో నాన్ స్ట్రయిక్ బ్యాటర్ స్టన్నింగ్ రీతిలో రనౌట్ అయ్యాడు. ఈ సంఘటన రెండో ఇన్నింగ్స్ ఫస్ట్ ఓవర్‌లోనే చోటుచేసుకున్నది.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పునేరీ జట్టు 202 రన్స్ చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రాయిగడ్ జట్టుకు తొలి ఓవర్‌లోనే జలక్ తగిలింది. స్ట్రయికర్ బ్యాటర్ సిద్దేశ్ వీర్ బంతిని ఆన్‌సైడ్ దిశగా ఆడాడు. అయితే ఆ బంతిని అందుకున్న కీపర్.. స్ట్రయికర్ దిశగా విసిరాడు. ఆ బంతి వికెట్లను తాకుతూ నాన్ స్ట్రయికర్ దిశగా వెళ్లింది. అయితే బంతి వికెట్లను తాకేలోగా స్ట్రయికర్ క్రీజ్‌లోకి వచ్చేశాడు. ఇక నాన్ స్ట్రయికర్ మాత్రం క్రీజ్‌లో అడుగుపెట్టలేకపోయాడు. ఫస్ట్ స్ట్రయికర్ వద్ద స్టంప్స్‌ను కూల్చి.. ఆ తర్వాత నాన్‌స్ట్రయికర్ వద్ద కూడా స్టంప్స్‌ను పడేయడంతో.. అనూహ్య రీతిలో నాన్ స్ట్రయికర్ రనౌట్ అయ్యాడు. దురదృష్టవశాత్తు ఓపెనింగ్ బ్యాటర్ హర్ష్ మోగవీర ఔట్ అయ్యాడు. ఆ ఔట్‌కు చెందిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నది.క్రికెట్‌లో ఇలా బంతి రెండు వైపుల ఉన్న వికెట్లకు తగిలి ఔటైన ఘటన చోటుచేసుకోవడం చాలా అరుదు. ఈ మ్యాచ్‌లో పునేరీ జట్టు 99 రన్స్ తేడాతో నెగ్గింది. రనౌట్ చేసిన షిండే ఈ మ్యాచ్‌లో 12 బంతుల్లోనే 40 రన్స్ స్కోర్ చేశాడు. అయితే గతంలోనూ టీ20 క్రికెట్‌లో ఇలాంటి ఘటన ఒకటి చోటుచేసుకున్నది. 2022లో జరిగిన బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో ఆండ్రూ రస్సెల్ ఇలాగే ఔటయ్యాడు.

# రిషబ్ పంత్ భారీ సిక్సర్.. పగిలిన స్టేడియం పైకప్పు..



లండన్ : ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ఆడేందుకు టీమిండియా లండన్ చేరుకున్నది. గిల్ నేతృత్వంలోని భారత జట్టు ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టింది. వైస్ కెప్టెన్ రిషబ్ పంత్(ఖీతిబష్ట్రజీఎష్ట్ర ఖజీనిబి).. ప్రాక్టీస్‌లో భారీ సిక్సర్ కొట్టాడు. అతని పవర్ షాట్‌కు.. స్టేడియంలో పైకప్పు పగిలింది. వాషింగ్టన్ సుందర్ వేసిన బౌలింగ్‌లో.. రిషబ్ పంత్ భారీ షాట్ కొట్టాడు. బెకన్‌హమ్ స్టేడియంలో ఉన్న పైకప్పుకు రంధ్రం పడింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో తన చివరి లీగ్ మ్యాచ్‌లో సెంచరీతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.ఇండియన్ టీమ్ ఇన్‌స్టా అకౌంట్‌లో ప్లేయర్ల ప్రాక్టీస్ వీడియోలను పోస్టు చేశారు. గిల్, పంత్, బుమ్రా, సిరాజ్, జడేజా ప్రాక్టీస్ చేస్తున్న విజువల్స్ ఉన్నాయి. హెడ్ కోచ్ గౌతం గంభీర్.. ప్లేయర్లతో మాట్లాడుతున్న వీడియోలు కూడా ఉన్నాయి. గిల్, పంత్.. బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. సిరాజ్, బుమ్రాలు .. బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్.. ప్లేయర్లతో డ్రిల్ ప్రాక్టీస్ చేయించాడు. గిల్ బ్యాటింగ్.. బుమ్రా బౌలింగ్ సెషన్‌లో చాలా సేపు సాగింది.ఇంగ్లండ్‌తో జూన్ 21 నుంచి తొలి టెస్టు ప్రారంభంకానున్నది. లీడ్స్, బర్మింగ్‌హామ్, లార్డ్స్, ఓవల్, మాంచెస్టర్‌లో టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి.

# నికోలస్ పూరన్ సంచలన నిర్ణయం.. 29 ఏళ్లకే రిటైర్మెంట్

వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 29 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని ఇన్‌స్టా వేదికగా వెల్లడించాడు. ఎంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నానని, తనపై ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు అంటూ పూరన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.'డియర్ ఫ్యాన్స్.. చాలా ఆలోచనలు, పరిశీలనల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాను. ఈ ఆట నాకెంతో ఇచ్చింది. ఇంకా ఇస్తూనే ఉంటుంది. ఈ ప్రయాణంలో ఎంతో ఆనందం, ఎన్నో మరుపురాని జ్ఞాపకాలు ఉన్నాయి. వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించడాన్ని గర్వంగా భావిస్తున్నా. మెరూన్ జెర్సీని ధరించడం, మైదానంలో నిలబడి జాతీయ గీతం ఆలపించడం.. జట్టు కోసం సాయశక్తులా కృషి చేయడం.. ఇవన్నీ నాకు ఎంత ముఖ్యమో మాటల్లో చెప్పలేను. వెస్టిండీస్ జట్టుకు సారథ్యం వహించడం ఎప్పటికీ మరిచిపోలేను.





అత్యంత అరుదైన గౌరవంగా భావిస్తాను. నాపై ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు. కష్ట సమయాల్లో అండగా నిలిచారు. నా సక్సెస్‌ను సెలెబ్రేట్ చేసుకున్నారు.నా కుటుంబం, స్నేహితులు, నా సతీమణితో పాటు నా ఈ ప్రయాణంలో నాతో నడిచిన మీకు ధన్యవాదాలు. మీ మద్దతు, నమ్మకం నన్ను నిలబెట్టాయి. నా కెరీర్‌లో అంతర్జాతీయ అధ్యాయం ముగిసినప్పటికీ.. వెస్టిండీస్ క్రికెట్‌పై నాకున్న ప్రేమ ఎప్పటికీ చెక్కు చెదరదు. వెస్టిండీస్ జట్టు మరింత బలంగా మారడంతో పాటు అద్భుతమై విజయాలు అందుకోవాలని కోరుకుంటా.'అని నికోలస్ పూరన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. నికోలస్ పూరన్ ఫ్రాంచైజీ క్రికెట్‌లో మాత్రమే ఆడనున్నాడు.2016లో పాకిస్థాన్‌తో దుబాయ్ వేదికగా జరిగిన టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన నికోలస్ పూరన్ 106 మ్యాచ్‌లు ఆడి 2275 పరుగులు చేశాడు. ఇందులో 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2019లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ వన్డేల్లోకి అడుగుపెట్టిన నికోలస్ పూరన్.. 61 మ్యాచ్‌ల్లో 1983 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలతో పాటు 11 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టెస్ట్ క్రికెట్ ఆడకుండానే నికోలస్ పూరన్ 9 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్ ముగిసింది.2019 వన్డే ప్రపంచ కప్‌లో నికోలస్ పూరన్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 9 మ్యాచ్‌ల్లో 367 పరుగులు చేసి విండీస్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో శ్రీలంకపై తొలి సెంచరీ సాధించిన పూరన్.. నెదర్లాండ్స్, నేపాల్‌పై మరో రెండు శతకాలు నమోదు చేశాడు. ఈ టోర్నీలో పూరన్ కనబర్చిన అత్యుత్తమ ప్రదర్శనకు ఐసీసీ రైజింగ్ స్టార్ అని పేర్కొంటూ అభినందించింది.టీ20ల్లో వెస్టిండీస్ తరఫున అత్యధిక పరుగులు (2275) సాధించిన ఆటగాడి పూరన్ నిలిచాడు.ఈ క్రమంలో అతను క్రిస్ గేల్ రికార్డును అధిగమించాడు.

# జుట్టు రాలటానికి మూలాలివే.. ఇవి తెలిస్తే నివారణ సాధ్యం!




జుట్టు రాలడం అతి పెద్ద సమస్య, దీనికి అనేక కారణాలున్నాయి. జుట్టు రాలటానికి పోషక లోపాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఎందుకంటే అనేక వ్యక్తులు అవసరమైన విటమిన్లు మరియు ఖనిజాలను ఆహారంలో తీసుకోవటం లేదు. ఒత్తిడి మరియు ఆందోళన కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణాలు. చాలా మంది అనుసరించే వేగవంతమైన జీవనశైలి కూడా జుట్టు రాలటానికి ప్రధాన కారణంగా మారుతుంది. జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు వాతావరణ మార్పులు, వాతావరణ నమూనాలలో మార్పులు వంటి వాటి వల్ల జుట్టు ఆరోగ్యం ప్రభావితమవుతుంది. కొన్ని జుట్టు సంరక్షణ ఉత్పత్తుల వినియోగం కూడా ప్రతికూల ప్రభావాలను కలిగి ఉండవచ్చు. అదనంగా, జీర్ణ సంబంధ ఆరోగ్య సమస్యలు జుట్టు రాలడాన్ని ప్రభావితం చేయవచ్చు, జుట్టు రాలే సమస్యలు మొత్తం ఆరోగ్యానికి ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది. ం జుట్టు రాలటంలో కీలక పాత్ర పోషించేవి ఇవే జెనెటిక్స్ జుట్టు రాలడంలో మరో కీలక అంశం. కుటుంబ చరిత్ర వ్యక్తులను ఈ సమస్య ముందు నుండి ఉంటే వారికి కూడా ఈ సమస్య తప్పక వస్తుంది. వయస్సుతో సంబంధిత హార్మోన్ల మార్పులు కూడా జుట్టు పలుచబడడం మరియు రాలడంలో తోడ్పడతాయి. ఈ సహజ ప్రక్రియలు తరచుగా నివారించలేనివి కానీ సరైన సంరక్షణతో జుట్టు బాగా రాలే సమస్యను తగ్గించవచ్చు. జీవనశైలి, ఒత్తిడి జుట్టు ఆరోగ్యంపై ప్రభావం ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో పనులు చేసే జీవనశైలి ఒత్తిడి స్థాయిలను పెంచుతుంది. పరోక్షంగా జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. పర్యావరణ కాలుష్యం మరో సమస్య. ఇది జుట్టును హానికరమైన మూలకాలకు గురిచేస్తుంది. అంతేకాదు హానికరమైన రసాయనాల షాంపూ లను ఉపయోగించటం లేదా స్టైలింగ్ చేయటం కోసం ఉపయోగించే లేటెస్ట్ టెక్నాలజీలు కూడా పెరిగిన జుట్టు రాలడానికి దారితీస్తాయి. ఖనీలివతీవట ఃఎ జుట్టు రాలటానికి కారణాల అధ్యయనం నివారణకు కీలకం ఈ కారణాలను అర్థం చేసుకోవడం జుట్టు రాలడాన్ని సమర్థవంతంగా పరిష్కరించడంలో సహాయపడుతుంది. జుట్టు పోషణపై దృష్టి పెట్టడం, ఒత్తిడిని తగ్గించుకోవటం మరియు అనుకూలమైన జుట్టు సంరక్షణ పద్ధతులను అవలంబించడం ద్వారా జుట్టు సంరక్షణకు కృషి చేయవచ్చు. కనుక జుట్టు రాలటానికి కారణాలు తెలుసుకుని తదనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

# మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? కారణాలు, లక్షణాలు, నివారణలు ఇవే!




ప్రస్తుత జీవన శైలి కారణంగా చాలామంది అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. అటువంటి అనారోగ్య సమస్యలలో మైగ్రేన్ ఒకటి. మైగ్రేన్ అనేది తీవ్రమైన తలనొప్పితో కూడిన నాడీ సంబంధిత రుగ్మత. ఇది సాధారణంగా ఒత్తిడి కారణంగా వస్తుంది. తలకు ఒక వైపున లేదా రెండు వైపులా విపరీతమైన నొప్పితో కొన్ని గంటల నుండి రోజుల వరకు కూడా ఈ నొప్పి ఉండవచ్చు. మైగ్రేన్ లక్షణాలు మైగ్రేన్ యొక్క సాధారణ లక్షణాలలో తలనొప్పి తీవ్రంగా ఉండవచ్చు. కంటి చూపులో మార్పులు, కంటి చూపు మందగింపు, చేతుల్లో జలదరింపు, కడుపులో వికారం, వాంతులు, విరోచనాలు, కాంతి మరియు శబ్ద సున్నితత్వం, నీరసం, విపరీతమైన అలసట, కండరాల బలహీనత, హార్మోన్ల మార్పులు, ఒత్తిడి, ఆందోళన వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయి. కుటుంబ చరిత్రలో మైగ్రేన్ ఉంటే కూడా మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలు ఇవి కూడా కావొచ్చు కొందరిలో శరీరం డీహైడ్రేషన్ కు గురైతే కూడా మైగ్రేన్ వస్తుంది. మెడనొప్పి ఎక్కువగా ఉన్నవారిలో కూడా మైగ్రేన్ వచ్చే ప్రమాదం ఉంది. క్రమరహిత జీవనశైలి, భావోద్వేగ ఒత్తిడి, తీవ్రమైన శారీరక శ్రమ, పానీయాలను ఎక్కువగా తీసుకోవడం, సరైన సమయానికి తినకపోవడం కూడా మైగ్రేన్ తలనొప్పి రావడానికి కారణాలుగా చెప్పవచ్చు. వీటివల్ల మైగ్రేన్ తలనొప్పి ప్రమాదం ఎక్కువగా ప్రయాణాలు చేసే వారిలోనూ, వాతావరణంలో మార్పుల కారణంగాను, వెన్నెముక సమస్యలు ఉన్న వారిలోనూ, ఎక్కువగా ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ, మైగ్రేన్ సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు. ఓరల్ కాంట్రాసెప్టివ్ పిల్స్ లాంటివి వాడే వారిలోనూ, నిరాశ ఆందోళనలకు లోనయ్యే వారిలోనూ, నిద్ర రుగ్మతలు ఉన్న వారిలోనూ మైగ్రేన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి కారణంగా ఈ ప్రమాదం మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారిలో కళ్ళు ఎర్రబడడం, కళ్ళల్లో నీళ్ళు రావడం, మాట్లాడలేకపోవడం, కళ్ళముందు జిగ్జాగ్ లైన్లు కనబడడం, శబ్దాలు వినిపించడం, కాళ్లు చేతులలో తిమ్మిర్లు రావడం, తల తిరగడం, వాంతులు కావడం, వికారం అనిపించడం, తలలో తీవ్రమైన నొప్పి రావడం వంటి సాధారణమైన లక్షణాలు కనిపిస్తాయి. అయితే మైగ్రేన్ తలనొప్పి తగ్గాలంటే అన్నిటికంటే ముందుగా జీవనశైలి మార్పులు చేసుకోవాలి. క్రమం తప్పకుండా నిద్ర మరియు ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. మైగ్రేన్ తలనొప్పి తగ్గేందుకు ఇలా చెయ్యండి ఒత్తిడి నిర్వహించడానికి యోగా, ధ్యానం వంటి వాటిని చేయాలి. మైగ్రేన్ తలనొప్పి ట్రిగ్గర్ అయ్యే ఆహారాలను నివారించాలి. శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకునేందుకు తగినంత నీటిని తాగాలి. నొప్పి నివారణ ఔషధాలను, మైగ్రేన్ కు డాక్టర్ ఇచ్చే మందులను తప్పనిసరిగా వాడాలి. నొప్పి మొదలైనప్పుడు ప్రశాంతంగా నిశ్శబ్దంగా, కాంతిలేని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి. నొప్పి ఉన్నచోట వెచ్చని లేదా చల్లని కంప్రెస్ ను తలపైన పెట్టుకోవాలి. ఈ విధంగా మైగ్రేన్ తలనొప్పి నుంచి కొంతమేర ఉపశమనాన్ని పొందవచ్చు.

# నడుం నొప్పిగా ఉంటే ఇలా చెయ్యండి... చాలా మంచి రిలీఫ్!



నడుం నొప్పి చాలా మందిని వేధించే సాధారణ సమస్య . సాధారణ సమస్య అయినప్పటికీ నడుము నొప్పి చాలా ఇబ్బంది పెడుతుంది. దీన్ని ప్రాథమికంగా ఇంటిలోనే కొన్ని చక్కటి చిట్కాలతో తగ్గించుకోవచ్చు . నడుమునొప్పి కోసం ఇంటి నివారణలు ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఈ చిట్కాలు సాధారణ నడుం నొప్పిని తగ్గించడానికి సహాయపడతాయి. నడుము నొప్పితో బాధపడేవారు ఎక్కువసేపు కూర్చోవడం, ఎక్కువసేపు నిల్చోవడం, ఎక్కువ సేపు పడుకోవడం వంటివి చెయ్యకూడదు. నడుం నొప్పి నుండి ఉపశమనం కలిగించే చిట్కాలు నడుము పైన ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదు. అధిక ఒత్తిడి లేకుండా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఎక్కువసేపు మంచం మీద పడుకునే ఉండడం మానుకోవడం మంచిది. ఈ విధంగా చేయడం కండరాలను బలహీనపరిచి నడుము నొప్పిని మరింత ఎక్కువ అయ్యేలా చేస్తుంది. సౌకర్యవంతమైన భంగిమలో పడుకోవడం, మోకాళ్ళ కింద దిండు పెట్టుకొని వెనక్కి పడుకోవడం వంటివి చేస్తే కాస్త నడుం నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. నడుం నొప్పి తగ్గించే రిలీఫ్ విధానాలు ఇక నడుం నొప్పితో ఎక్కువ బాధ పడేవారు హీట్ ప్యాక్ లేదా ఐస్ ప్యాక్ పెట్టుకుంటే నడుము నొప్పి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు నడుము కండరాలకు ఉపశమనం కలిగించే ఎక్సర్సైజులు చేయడం కూడా మంచిది. కూర్చున్నప్పుడు లేదా నిలుచున్నప్పుడు నడుము భంగిమ సరైన విధంగా ఉండేలా చూసుకోవడం కూడా నడుము నొప్పి నుంచి రిలీఫ్ ఇస్తుంది. మసాజ్ లతో నడుం నొప్పి నుండి ఉపశమనం నడుం భాగంలో తేలికపాటి మసాజ్ లు చేసుకోవడం వల్ల కూడా కండరాల నొప్పి సడలి నడుము నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆలివ్ నూనె, కొబ్బరి నూనెలతో మసాజ్ చేయడం వల్ల నడుము నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. అల్లం టీ తాగడం వల్ల, ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు కలిపి తాగడం వల్ల కూడా కాస్త ఉపశమనం ఉంటుంది. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు నడుం నొప్పిని తగ్గిస్తాయి. ఈ చర్యలతోనూ నడుం నొప్పి నుండి ఉపశమనం గోరువెచ్చని నీళ్లలో ఎప్సం సాల్ట్ కలిపి, ఆ నీళ్లలో ఒక క్లాత్ ను ముంచి, నడుము పైన కాపడం పెట్టడం వల్ల కూడా నడుమునొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇక శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడం వల్ల కూడా నడుం కండరాలకు ఉపశమనం కలిగి నడుమునొప్పి తగ్గుతుంది. నడుమునొప్పి తగ్గడానికి తాత్కాలిక ఉపశమనం కోసం ఇబుప్రోఫెన్, పారాసిటమాల్ వంటి టాబ్లెట్స్ కూడా నొప్పి నివారణ మందులు గా పనిచేస్తాయి. నొప్పి ఎక్కువగా ఉంటే ఇలా చెయ్యండి అయితే వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది. ఇక నొప్పి తీవ్రంగా ఉంటే తప్పనిసరిగా డాక్టర్ ను సంప్రదించి డాక్టర్ సూచన మేరకు మాత్రమే మందులు వాడాలి. నడుము నొప్పి ఎక్కువగా ఉంటే కాళ్లల్లో తిమ్మిరి, బలహీనత అనిపిస్తాయి. నొప్పి ఒక వారం కంటే ఎక్కువగా ఉంటే, మూత్ర విసర్జనలో ఇబ్బంది కలిగినా తక్షణం వైద్యున్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిది.

# ఇవి ట్రై చేయండి, షుగర్ పెరగమన్నా పెరగదు..!!




మధుమేహం. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా కోట్లాది మందిని వెంటాడుతున్న సమస్య. షుగరు వచ్చిందంటే శరీరం మొత్తం ప్రభావితం అవుతుంది. ఏ ఒక్క భాగానికో కాదు. ప్రతీ అవయవం మీద తన శక్తిని చూపిస్తుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ముప్పు తప్పదు. మధుమేహానికి నియంత్రణ మాత్రమే సరైన మందు. మదుమేహ బాధితులకు ఆహారం.. జీవనశైలి అన్నింటి కంటే ముఖ్యం. ఇక, చిన్నపాటి చిట్కాలు.. ఆహారంలో మార్పులతో మధుమేహాన్ని నియంత్రించుకొనే అవకాశం ఉంది. రుచిని అందిస్తూనే షుగరు పెరగకుండా కడుపు నింపే ఆహారాలు మధుమేహ బాధితులకు ఎంతో మేలు చేస్తాయి మధుమేహం ఉంటే మధుమేహ నిర్వహణ లో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అధిక ఫైబర్ మరియు తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉన్న ఆహారాలు అనుకూలంగా ఉంటాయి. దక్షిణ భారతీయ వంటకాలు, అనుసరించినప్పుడు, ఈ ఆహార అవసరానికి సరిపోతాయి. ఇందుకు సంబంధించి ఆహార ఎంపికల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇడ్లీ, రాగి లేదా ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో వీటిని తయారు చేయవచ్చు. ఈ ప్రత్యామ్నాయాలు సాంప్రదాయ బియ్యం ఇడ్లీల కంటే ఎక్కువ ఫైబర్ అందిస్తాయి. దోశలను కూడా పోషక విలువను పెంచడానికి మల్టిగ్రైన్ పిండి ఉపయోగించి తయారు చేయవచ్చు. మధ్యాహ్న భోజనం దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా సాంబార్ వినియోగిస్తారు. ఇది సహజంగానే ఆరోగ్యకరం. పప్పులు ,కూరగాయలను కలిగి ఉంటుంది, ఇవి ఫైబర్లో సమృద్ధిగా ఉంటాయి. నూనె పరిమాణాన్ని తగ్గించడానికి, తాలింపు తక్కువ నూనెతో లేదా ఎయిర్ ఫ్రయర్ ఉపయోగించి చేయవచ్చు. సాంబార్ తీసుకురావడానికి తెల్ల బియ్యం స్థానంలో బ్రౌన్ రైస్ ఎంచుకుంటే ప్రయోజనం ఉంటుంది. కూరగాయల కర్రీలు అదనపు పోషకాల కోసం పాలకూర లేదా మెంతి వంటి ఆకుకూరలను వినియోగించాలి. గ్రేవీలలో కొబ్బరి పాలను తక్కువ కొవ్వు పెరుగు తో మార్చవచ్చు. అదే విధంగా మధు మేహ బాధితులు స్నాక్స్ గా వడలు వంటి స్నాక్స్ తక్కువ కేలరీ పరిమాణం కలిగినవి తీసుకోవచ్చు. ఎక్కువగా గ్లెమిక్సిన్ లేని పదార్థాలతో తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలి. పాయసం వంటి సాంప్రదాయ స్వీట్ ను స్టీవియా, బెల్లం వంటి సహజ ప్రత్యామ్నాయాలతో తయారు చేసుకోవచ్చు. దీని ద్వారా సహజ సిద్ధమైన తియ్యదనం వస్తుంది. పూర్తి క్రీమ్ పాల స్థానంలో స్కిమ్డ్ పాలు ఉపయోగించడం కొవ్వు పరిమాణాన్ని తగ్గించటంతో పాటుగా రుచిని కూడా ఇస్తుంది. ఇలా, ప్రాసెస్ చేసిన ఫుడ్ .. చెక్కెర ఉన్న పదార్థాలు.. నిల్వ ఉన్న వాటికి దూరంగా ఉంటూ.. సరైన జీవన శైలిని.. వ్యాయామంతో జత చేసి.. ఆహారంలో సరైన పద్ధతులను అలవాటు చేసుకుంటే మధుమేహ బాధితులకు షుగరు లెవల్స్ పెరగకుండా నియంత్రించుకోవచ్చు.

# కొందరికి చేపలు తినటం ఆరోగ్యం కాదు.. జాగ్రత్త!



గా ఉంటాయి. అయినా కొందరికి చేపలు తినటం మంచిది కాదు అందుకు చాలా కారణాలు ఉన్నాయి. చాలా మందికి చేపల కారణంగా అలెర్జీలు వస్తాయి. అలెర్జీల సమస్యలు ఉన్నవారు చేపలను తినకుండా ఉంటేనే మంచిది. చేపలు తింటే కొందరికి అనారోగ్యం చేపలు తిన్న వెంటనే తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అప్పటికప్పుడు షాక్ వంటి కొన్ని లక్షణాలు కనిపించొచ్చు. కొన్ని చేపలు కలుషిత నీటిలో పెరిగినవై ఉండవచ్చు. ఇవి టాక్సిన్స్‌ను కలిగి ఉండవచ్చు. ఇటువంటి చేపలు కూడా ప్రమాదకరం. ఇవి ఆరోగ్యానికి హానికరం. ఈ చేపలతో కొందరికి హాని హై మెర్క్యూరీ స్థాయిలు ఉన్న చేపలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ముఖ్యంగా ట్యూనా, షార్క్, స్వోర్డ్‌ఫిష్ వంటి పెద్ద చేపలలో పాదరసం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇవి గర్భిణీ స్త్రీలు, పిల్లలు లేదా నాడీ వ్యవస్థ సమస్యలు ఉన్నవారికి హానికరం అని చెప్పొచ్చు. ముఖ్యంగా గర్భవతులూ, చిన్న పిల్లలూ ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఈ రోగాలున్న వారికి చేపలు తింటే ప్రమాదం కొన్ని రోగాలున్నవారికి చేపలు ప్రమాదకరం అని చెప్తారు. గౌట్, కిడ్నీ సమస్యలు ఉన్న వారికి చేపలు ప్రమాదకరం. చేపల్లో ప్యూరిన్లు ఎక్కువగా ఉండడం వల్ల గౌట్ రోగులకు ప్రమాదం. కిడ్నీ వ్యాధులు ఉన్నవారికి కూడా ఎక్కువ ప్రోటీన్‌ను ప్రాసెస్ చేయడం కష్టంగా మారవచ్చు. ప్రాసెసింగ్ సరిగ్గా చెయ్యని లేదా కాలుష్యం కారణంగా ఉన్నా చేపలు మనకు హాని చేస్తాయి. కొన్ని రకాల చేపలతో అనారోగ్యాలు .. జాగ్రత్త కొన్నిసార్లు చేపలు పరిశుభ్రంగా కాకుండా నిల్వ చేస్తే, లేదా కాలుష్యమైన నీటిలో పెరిగితే, వాటి ద్వారా హానికరమైన బ్యాక్టీరియా లేదా టాక్సిన్లు మన శరీరానికి హాని కలిగించే ప్రమాదం ఉంటుంది. ఒక్కోసారి చేపలలోని అధిక ప్రోటీన్ లేదా కొవ్వు కొందరి జీర్ణవ్యవస్థకు సరిపడకపోవచ్చు, ముఖ్యంగా కాలేయం లేదా గట్ సమస్యలు ఉన్నవారికి చేపలు ఇబ్బంది కలిగించవచ్చు. కనుక చేపలు తిన్న తర్వాత ఎవరికైనా ప్రతికూల లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవటం మంచిది.




# ఎన్టీఆర్ ‘వార్ 2’ తెలుగు రిలీజ్ ప్లానింగ్..!




ఎన్టీఆర్ నటించిన మొదటి హిందీ సినిమా ‘వార్ 2’ రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. పాట చిత్రీకరణ మినహా మొత్తం షూటింగ్ పూర్తి అయింది. ఆ పాట కూడా ఇప్పటికే షూట్ చేయాల్సి ఉన్నా హృతిక్ రోషన్ గాయం కారణంగా వాయిదా పడ్డ విషయం తెల్సిందే. ఈ నెలలో ఆ పాట కూడా పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను ఆగస్టులో విడుదల చేయబోతున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ స్పీడ్ పెంచారు. పాన్ ఇండియా రేంజ్‌లో ఈ సినిమాను భారీ ఎత్తున విడుదల చేసేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. హిందీలో యశ్ రాజ్ ఫిల్మ్స్ వారు తమకు ఉన్న పలుకుబడితో ఉత్తర భారతంలో భారీ ఎత్తున విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక సౌత్ విషయానికి వస్తే తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్‌కి ఉన్న క్రేజ్ నేపథ్యంలో బిగ్ రిలీజ్ దక్కే అవకాశాలు ఉన్నాయి. కానీ తమిళనాట మాత్రం అదే సమయంలో సూపర్ స్టార్ రజనీకాంత్ మూవీ కూలీ ఉన్న కారణంగా మినిమం థియేటర్లు కూడా వార్ 2 కి దక్కే అవకాశాలు లేవు అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. అక్కడ సినిమా సూపర్ హిట్ అయితే తప్ప రెండో వారం నుంచి కలెక్షన్స్ వచ్చే పరిస్థితి లేదు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కోలీవుడ్‌లో ఈ సినిమా బిగ్ రిలీజ్‌కి ప్రయత్నాలు జరుగుతున్నాయి.తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా కొన్ని ఏరియాల్లో అమ్మి, కొన్ని ఏరియాలను నేరుగా రిలీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఈ సినిమా యొక్క ఉత్తరాంధ్ర రైట్స్‌ను కొనుగోలు చేశాడని సమాచారం అందుతోంది. మరో రెండు మూడు ఏరియాల్లోనూ సినిమాను అమ్మే అవకాశాలు ఉన్నాయి. కొన్ని ఏరియాల్లో ఇప్పటికే నిర్మాణ సంస్థ స్వయంగా థియేటర్లను బుక్ చేస్తుందని సమాచారం అందుతోంది. సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో చాలా పట్టుదలతో మేకర్స్ ఉన్నారు. అందుకు తగ్గట్లుగానే థియేటర్లను ముందస్తుగా బుక్ చేసి పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌కి ఉన్న క్రేజ్ నేపథ్యంలో వార్ 2 తెలుగు రాష్ట్రాల్లో కనీసం రూ.250 కోట్ల వసూళ్లు రాబట్టే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో విలన్ పాత్రలో ఎన్టీఆర్ కనిపించబోతున్నాడు అనే వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు మేకర్స్ నుంచి ఎన్టీఆర్ నెగటివ్ షేడ్స్ అనే విషయమై క్లారిటీ ఇవ్వలేదు. హీరోయిన్‌గా ఈ సినిమాలో కియారా అద్వానీ నటించిన విషయం తెల్సిందే. ఇటీవల విడుదలైన టీజర్ కాస్త అసంతృప్తి కలిగించినా సినిమా మాత్రం కచ్చితంగా అంచనాలను అందుకుంటుంది అనే అభిప్రాయంతో మేకర్స్ ఉన్నారు. ఎన్టీఆర్ పాత్ర కోసం తెలుగు ప్రేక్షకులు ముఖ్యంగా నందమూరి అభిమానులు చాలా ఆసక్తిగా ఉన్నారు. అందుకు తగ్గట్లుగా దర్శకుడు ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రను డిజైన్ చేశాడని తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా వార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ భారీగా నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.



# మళ్లీ ప్రేమ కథల టైం వచ్చిందేమో..!

: రామ్ గోపాల్ వర్మ చెప్పినట్లుగా ఒకప్పుడు బాలీవుడ్‌లో అమితాబ్ బచ్చన్‌తో పాటు మరికొందరు సీనియర్ హీరోలు యంగ్ ఏజ్‌లో చేసిన యాక్షన్, మాస్ మసాలా సినిమాలు అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నాయి. మాస్ మసాలా సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకుంటున్న సమయంలో మ్యూజిక్ కంపెనీలు నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టి సంగీత నేపథ్యంలో సినిమాలను రూపొందించారు. దాంతో బాలీవుడ్‌లో యాక్షన్ సినిమాల లోటు మొదలైంది. బాలీవుడ్‌లో రూపొంది సూపర్ హిట్ అయిన ఎన్నో సినిమాలను సౌత్‌లో చిరంజీవి, రజనీకాంత్ వంటి స్టార్ హీరోలు రీమేక్ చేసి సూపర్ స్టార్‌లు అయ్యారని వర్మ పేర్కొన్నాడు.బాలీవుడ్‌లో దశాబ్దం ముందు వరుకు ప్రేమ కథా చిత్రాలు ఎక్కువగా వచ్చేవి. అలా వచ్చిన ప్రేమ కథలు సూపర్ హిట్‌గా నిలిచాయి. షారుఖ్ ఖాన్‌తో పాటు, సల్మాన్, అమీర్ ఖాన్‌లు సైతం ప్రేమ కథా చిత్రాల వల్లే స్టార్స్‌గా నిలిచారు. లవ్ స్టోరీ సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకుంటున్న సమయంలోనే స్పై థ్రిల్లర్ జోరు మొదలు అయ్యాయి. చాలా సినిమాలు అదే జోనర్‌లో వచ్చి హిట్‌గా నిలిచాయి. వందల కోట్ల వసూళ్లను సాధించాయి. కానీ గత కొన్నాళ్లుగా స్పై థ్రిల్లర్‌లకు ఆధరణ తగ్గుతూ వస్తుంది. ప్రతి సినిమాలోనూ అదే నేపథ్యం ఉంటున్న కారణంగా ప్రేక్షకులు విసుగు చెంది పోయారు. అవసరమా అన్నట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో వచ్చిన వార్, పటాన్‌తో పాటు మరికొన్ని స్పై థ్రిల్లర్స్ అదే కథ, అదే నేపథ్యంతో వచ్చిన నేపథ్యంలో ముందు ముందు రాబోతున్న స్పై సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి కలగడం లేదు. టైగర్ సినిమాతో హిట్ కొట్టిన సల్మాన్ ఆ తర్వాత స్పై థ్రిల్లర్‌లను చేసినా ఆకట్టుకోలేక పోయాడు. అదే ఫార్ములా ఇతర హీరోలకు ముందు ముందు వర్తించడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



అందుకే బాలీవుడ్‌లో స్పై థ్రిల్లర్స్‌ను మానేసి మాస్ మసాలా సినిమాలతో పాటు ప్రముఖంగా లవ్ స్టోరీ సినిమాలు చేస్తే బాగుంటుందని ఒక వర్గం ఫిల్మ్ మేకర్స్ భావిస్తున్నారు. మెల్ల మెల్లగా ప్రేక్షకులను ఆ జోనర్‌కి అలవాటు చేయాలని భావిస్తున్నారు. జనరేషన్‌లు మారుతున్నా కొద్ది ఫిల్మ్ మేకింగ్ విషయంలోనూ మార్పు రావాల్సిన అవసరం ఉంది. అందుకే బాలీవుడ్‌లో కొత్త వారు మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఎంకరేజ్ చేయాల్సి ఉంది. పెద్ద నిర్మాతలు అలాంటి సినిమాలను తీస్తేనే బాలీవుడ్‌లో మార్పు వస్తుంది. కరోనా సమయం నుంచి బాలీవుడ్‌లో సక్సెస్ రేటు దారుణంగా పడి పోయింది. కనీసం అయిదు నుంచి పది శాతం కూడా సక్సెస్ రేటు నమోదు కావడం లేదు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందుకే బాలీవుడ్‌లో కూడా సౌత్‌లో మాదిరిగా అన్ని రకాల సినిమాలను తీస్తూ ఉండాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.


# ఎన్టీఆర్ రోల్...కాస్ట్యూమ్ డిజైనర్ కే సవాల్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ ‘వార్ 2’ తో బాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. తారక్ పాత్ర విషయం లో ఎన్నో సందేహాలున్నాయి. హీరో పాత్ర పోషిస్తున్న హృతిక్ రోషన్ రోల్ కి ధీటుగా ఉంటుందనే ప్రచారం తొలి నుంచి ఉంది. ఈ నేపథ్యంలో తారక్ పాజిటివ్ రోల్ లో కనిపిస్తాడా? నెగిటివ్ రోల్ లా కనిపిస్తాడా? అని ఎన్నో సందేహాలున్నాయి. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు...యూనిట్ లీకులను బట్టి తారక్ బలమైన ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నాడని తెలుస్తోంది.మరి ఆ పాత్ర ప్రత్యేకత ఏంటి? అంటే చాలా ప్రత్యేకతలే ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి సంబంధించి ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అనతా ష్రాఫ్ అడజానియా కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. తారక్ పాత్రలో చాలా కోణాలున్నాయన్నారు. ఆ పాత్రకు సంబంధించి చాలా లుక్స్ డిజైన్ చేసానన్నారు. ఆ పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించేలా ఎన్నో విభిన్నమైన కాస్ట్యూమ్స్ డిజైన్ చేసాం. అదంత ఈజీగా జరగలేదు. డిజైనింగ్ విషయంలో మాకు కూడా కొన్ని సందర్భాల్లో సవాల్ గా అనిపించిందన్నారు. ‘తారక్ సెట్ లోకి వస్తే ఆ ఎనర్జీ అంతా అందరికీ వచ్చేస్తుంటుంది. తనలో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉందనిపిస్తుంది. ఆయన్ని ఓ లక్ష్యంతో పనిచేసే మానవ యంత్రంలా చూపించే ప్రయత్నం చేసామ’న్నారు ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తారక్ సెట్లోకి అడుగు పెడతే అతడికి భాషతో సంబంధం ఉండదని తొలిసారి ప్రూవ్ అయింది. సినిమా సెట్ ఏది అయినా? సెట్ లో ఉన్నంత సేపు తానెంత అంకిత భావంతో పనిచేస్తాడన్నది మరో సారి ప్రూవ్ అయింది. ఇక వెండి తెరపై తారక్ మెరుపులు ఎలా ఉంటాయో ఊహకే అందదు. ఇప్పటికే రిలీ జ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తెలుగు సినిమా కాకపోయినా తారక్ ఎంట్రీ తో గ్రాండ్ గా టాలీవుడ్ లో రిలీజ్ అవుతుంది.

# నెట్ ఫ్లిక్స్ తో కమల్ మరోసారి బేరాలు.. దేనికంటే?

లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వంలో లోక నాయకుడు చేసిన సినిమా థగ్ లైఫ్. రీసెంట్ గానే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. మణిరత్నం- కమల్ హాసన్ కాంబినేషన్ లో గతంలో వచ్చిన నాయగన్ సినిమా బ్లాక్ బస్టర్ అవడం, ఆ తర్వాత వీరిద్దరి కలయికలో 37 ఏళ్లకు వస్తున్న సినిమా కావడంతో థగ్ లైఫ్ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దానికి తగ్గట్టే కమల్ హాసన్ కూడా థగ్ లైఫ్ ప్రమోషన్స్ లో సినిమా చాలా బాగా వచ్చిందని, నాయగన్ సినిమాను మించి ఈ సినిమా హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేయడంతో థగ్ లైఫ్ పై ఉన్న అంచనాలు తారా స్థాయికి చేరాయి. అదే నమ్మకంతో నెట్‌ఫ్లిక్స్ తో మాట్లాడి 8 వారాల తర్వాతే సినిమాను స్ట్రీమింగ్ చేసేలా ఒప్పించామని కూడా కమల్ చాలా గొప్పగా చెప్పారు. కానీ థగ్ లైఫ్ రిలీజ్ తర్వాత మొత్తం మారిపోయింది. గత పదేళ్లలో భారీ ఫ్లాపులుగా నిలిచిన ఇండియన్2, కంగువా సినిమాలను దాటేలా థగ్ లైఫ్ కలెక్షన్లు కనిపిస్తున్నాయి. మరీ ఇంత దారుణమైన రిజల్ట్ వస్తుందని ఊహించని చిత్ర యూనిట్ కు ఈ సినిమా ద్వారా తీవ్ర నిరాశ ఎదురైంది. అయినప్పటికీ చేసేదేమీ లేక ఉన్న దాంట్లోనే డబ్బుని ఎలా రాబట్టుకోవాలనే ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే థగ్ లైఫ్ యూనిట్ తిరిగి నెట్ ఫ్లిక్స్ తో బేరసారాలు మొదలుపెట్టినట్టు కోలీవుడ్ వర్గాలు చెప్తున్నాయి. 8 వారాలకు బదులు నెలకే సినిమాను స్ట్రీమింగ్ చేసేలా డీల్ కుదుర్చుకుని నెట్ ఫ్లిక్స్ నుంచి భారీ మొత్తం తీసుకోవాలని చూస్తున్నారట. ఆల్రెడీ థగ్ లైఫ్ టాక్ బయటకు వచ్చింది. డిజాస్టర్ అయిన థగ్ లైఫ్ సినిమాకు నెట్ ఫ్లిక్స్ ఎక్కువ మొత్తం ఇవ్వకపోయినా ముందు డీల్ కుదుర్చున్న దాని కంటే ఎక్కువే వచ్చే అవకాశముంది. దానికి కారణం లేకపోలేదు. కొన్ని సినిమాలను థియేటర్లలో చూడకపోయినా ఓటీటీలో ఎక్కువ మంది చూస్తారు. కంగువా, విడాముయార్చి, రెట్రో లాంటి సినిమాలు దీన్ని ప్రూవ్ చేసి మంచి వ్యూస్ తెచ్చుకున్నాయి. ఇప్పుడు థగ్ లైఫ్ కూడా అదే దారిలో వెళ్లాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. మణిరత్నం కెరీర్లోనే వీక్ మూవీగా నిలిచిన థగ్ లైఫ్ రిజల్ట్ ను కమల్ హాసన్ కూడా ఇప్పట్లో మర్చిపోలేదు.



# ఎస్ ఎస్ ఎంబి 29 అసలు కథ రామాయణమా!

ఎస్ ఎస్ ఎంబీ 29 చిత్రాన్ని రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు షెడ్యూళ్ల చిత్రీకరణ కూడా పూర్తయింది. ఈ సినిమా స్టోరీ విషయానికి వస్తే అందరికీ తెలిసిందల్లా ఒకటే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగే అడ్వెంచర్ థ్రిల్లర్. ఇదే కథను గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ గా చూపించబోతున్నారు. ఇంతకు మించి సినిమాకు సంబంధించి ఇంకే విషయం తెలియదు. అయితే ఈ కథకు స్ఫూర్తి రామాయణం అన్న సంగతి వెలుగులోకి వస్తోంది. ఇందులో మహేష్ పాత్ర రామాయణంలో హనుమంతుడిని పోలి ఉంటుందంటున్నారు. వివరాల్లోకి వెళ్తే... ఇండియానా జోన్స్ యాక్షన్ శైలి సినిమా తీయాలన్నది రాజమౌళి కల. చనిపోయిన వారిని బ్రతికించే ఓశక్తి ఉందని పురాణాల్లో అంత పవర్ ఉన్నది కేవలం సంజీవని చెట్టుకే అని రామాయణం చెబుతుంది. రామాయణంలో రావణుడి కుమారుడు ఇంద్రజిత్ యుద్ధం కారణంగా రాముడి సోదరుడు లక్ష్మణుడు తీ వ్రంగా గాయపడతాడు. ప్రాణాపాయ స్థితికి చేరుకుంటాడు. దీంతో రాముడు వెంటనే హనుమంతుడిని పిలిచి హిమాలయాల్లో ఉన్న సంజీవని మూలిక తీసుకురమ్మని ఆదేశిస్తాడు. సరిగ్గా ఇదే పాయింట్ ను బేస్ చేసుకుని ఎస్ ఎస్ ఎంబీ 29 కథని రైటర్ విజయేంద్ర ప్రసాద్ సిద్ధం చేసినట్లు వినిపిస్తుంది

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**